teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక


ములుగు | సంపుటి : 03 | సంచిక : 240 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 1 జనవరి 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.


## న్యూ ఇయర్‌కు వేడుకలకు దూరంగా రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): న్యూ ఇయర్‌కు వేడుకలకు దూరంగా ఉంటున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. గత వారం ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ వృద్ధాప్య సమస్యలతో ఢిల్లీ ఎయిమ్స్‌లో కన్నుమూశారు. అపర చాణక్యుడిగా పేరుగాంచిన మన్మోహన్ మృతికి కేంద్ర ప్రభుత్వం ఏడు రోజులు సంతాప కార్యక్రమాలు ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ ఏడు రోజులు అన్ని పార్టీ కార్యక్రమాలు రద్దు చేసుకుంది. ఈ తరుణంలో మన్మోహన్ సింగ్ సంతాప దినాల సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం కొత్త సంవత్సరం వేడుకలకు దూరంగా ఉంటున్నట్లు తెలిపింది. నూతన సంవత్సరం సందర్భంగా వేడుకలకు హాజరు కావద్దని నిర్ణయం తీసుకుంది. వేడుకలకు దూరంగా ముఖ్యమంత్రితో పాటు మంత్రులు ఉండనున్నారు.

# బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు



అన్ని శాఖల నుంచి బడ్జెట్ ప్రతిపాదనలకు ఆహ్వానం

ఈ నెల 4లోపు విధించిన గడువు

రాష్ట్ర బడ్జెట్‌పై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. అన్ని శాఖల నుంచి బడ్జెట్ ప్రతిపాదనలు ఆహ్వానించింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు.



## సైనిక్ స్కూల్స్ ఏర్పాటుపై విద్యా కమిషన్ ఛైర్మన్ లేఖ

లేఖలో సైనిక్ స్కూల్స్ ఏర్పాటుకు చర్యలపై సలహాలు

హైదరాబాద్, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): సైనిక్ స్కూల్స్ ఏర్పాటుపై విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి కి బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ లేఖ

మిగతా 2 లో



## సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు శాశ్వత భవనాలు నిర్మిస్తాం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్ ): కార్పొరేట్ స్థాయిలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు శాశ్వత భవనాలు నిర్మిస్తామని

మిగతా 2 లో



## మనీ ట్రాన్‌ఫర్‌కు ఆర్బీఐ సరికొత్త నిబంధన రూపకల్పన

ఈ మేరకు ఆర్బీఐ ఓ ప్రకటన విడుదల

ఆన్‌లైన్ మనీ ట్రాన్‌ఫర్ ను మరింత పటిష్టం చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సరికొత్త నిబంధనలను అమల్లోకి తీసుకురాబోతోంది. ఏప్రిల్ 1, 2025 నాటికి నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్ ట్రాన్స్‌ఫర్, రియల్ టైమ్ గ్రాస్ సెటిల్‌మెంట్ సిస్టమ్‌ను ఉపయోగించే అన్ని బ్యాంకులు ఈ కొత్త నిబంధనలను ఫాలో కావాల్సి ఉంటుంది.

న్యూ ఢిల్లీ, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): నిధుల బదిలీలో పొరపాట్లను నివారించడానికి, మోసాలను అరికట్టడం కోసం లబ్ధిదారుల ఖాతా పేరును ధ్రువీకరించే సదుపాయాన్ని తీసుకురాబోతున్నట్టు ఆర్బీఐ ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ కొత్త సదు-పాయం ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసే వ్యక్తి లబ్ధిదారుల పేరును తెలుసుకునే వీలు కలుగుతుంది. చెల్లింపుదారు

మిగతా 2 లో



## ఈ విద్యా సం.లో మారనున్న ఇంటర్ అడ్మిషన్ల విధానం

డిగ్రీ అడ్మిషన్ల మాదిరి ఇంటర్ ప్రవేశాలకు కసరత్తు

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ఇంటర్మీడియట్ అడ్మిషన్ల విధానం 2025-26 విద్యా సంవత్సరం నుంచి మారనుంది. రాష్ట్రంలో డిగ్రీ అడ్మిషన్ల మాదిరి ఇంటర్ ప్రవేశాలకు కూడా ఆన్‌లైన్ అడ్మిషన్లు చేపట్టేందుకు రంగం సిద్ధమవుతుంది. డిగ్రీ అడ్మిషన్లకు అనుసరిస్తున్న 'దోస్త్' తరహాలోనే ఇంటర్‌లో జూనియర్ కాలేజీ

మిగతా 2 లో

## కేటీఆర్ పిటిషన్‌పై హైకోర్టులో ముగిసిన వాదనలు

ఏసీబీకి హైకోర్టు కీలక ఆదేశాలు జారీ

క్వాష్ పిటిషన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వ్



హైదరాబాద్, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): ఫార్ములా -ఈ రేస్ కేసులో ఏసీబీ దాఖలు చేసిన కేసును క్వాష్ చేయాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు ముగిశాయి. క్వాష్ పిటిషన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వ్

మిగతా 2 లో



## న్యూసెన్స్ చేసే వారికి తెలంగాణ వినూత్న హెచ్చరిక

డ్రంక్ అండ్ డ్రైవ్ చేసినా, డ్రగ్స్ వాడినా జైలు పాలవ్వక తప్పదు



## రాష్ట్ర ప్రజలందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు

రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క)

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): కొత్త సంవత్సరంలో నూతన ఆశయాలు, లక్ష్యాలతో ప్రజలంతా కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టాలని మంత్రి సీతక్క ఆకాక్షించారు. నేరాలకు పురికొల్పే డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. డ్రగ్స్, పబ్స్, క్లబ్స్, గంజాయి వంటివాటితో

మిగతా 2 లో

## డీజీపీ జితేందర్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక విజ్ఞప్తి

రోడ్డు భద్రతా మాసం సందర్భంగా అధికారులతో జూమ్ మీటింగ్




తెలంగాణ డీజీపీ జితేందర్ కు మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక విజ్ఞప్తి చేశారు. జనవరి 1 నుండి జనవరి 31వరకు జరిగే జాతీయా రోడ్డు భద్రతా మాసం సందర్భంగా అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతా మాసంలో భాగంగా వర్క్ షాప్‌లు, సెమినార్లు, డ్రైవర్లకు, స్కూల్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, కంటి చెకప్ క్యాంపులు నిర్వహించాలని కోరారు.

హైదరాబాద్, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో ఉన్న 97 ఆర్టీసీ డిపోలు, 62 రవాణా కార్యాలయాల్లో భద్రతా నియమాలతో అవగాహన కల్పిస్తూ బ్యానర్ ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు భద్రతా మాసంలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్, ఐపీఎస్‌లు

మిగతా 2 లో

## అమిత్ షా పర్యటన అనంతరం దండకారణ్యంలో ఉద్రిక్త



మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా విస్తృతంగా కూంబింగ్

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): హోం మంత్రి అమిత్ షా ఛత్తీస్గఢ్ పర్యటన తరువాత దండకారణ్యంలో మరింత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా భద్రతాబలగాలు విస్తృతంగా కూంబింగ్ చేపడుతున్నాయి. రాష్ట్ర సరిహద్దులు దాటి మరి

మిగతా 2 లో



## అంతరిక్షంలోకి మహిళా రోబో

పంపేందుకు సిద్ధమైన భారత్

కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

.. వివరాలు 2లో




## జనవరి 4న తెలంగాణ కేబినెట్ సమావేశం

పలు కీలక అంశాలపై చర్చించే అవకాశం

హైదరాబాద్, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): తెలంగాణ కేబినెట్ సమావేశం జనవరి 4వ తేదీన సాయంత్రం 4గంటలకు సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరుగనుంది. సమావేశంలో రైతు భరోసా, భూమిలేని నిరుపేదలకు ఏడాదికి రూ.12 వేలు ఆర్థిక

మిగతా 2 లో

# బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు



హైదరాబాద్, డిసెంబరు 31 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర బడ్జెట్‌పై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. అన్ని శాఖల నుంచి బడ్జెట్ ప్రతిపాదనలు ఆహ్వానించింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. శాఖలు, పథకాల వారీగా వ్యయ అంచనాలను ప్రతిపాదించాలని సూచించారు. ఈ నెల 4లోపు పంపాలని తెలిపింది. మోదీ సర్కారు ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఆ బడ్జెట్‌లో రాష్ట్రానికి వచ్చే గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్లు, ప్రత్యేక గ్రాంట్లు, పన్ను వాటాలను పరిశీలించి రాష్ట్ర బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టడం అనవాయితీగా వస్తోంది. దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం 2025-26 బడ్జెట్ కసరత్తు ప్రారంభించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం రూ.2,91,159 కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టింది. కొత్త బడ్జెట్ ఎంత ఉండాలన్నది అన్ని శాఖల నుంచి ప్రతిపాదనలు అందిన తర్వాత ప్రభుత్వం ఒక అంచనాకు రానుంది.

## మనీ ట్రాన్స్‌ఫర్ కు ఆర్బీఐ సరికొత్త నిబంధన రూపకల్పన




మొదటి పేజీ తరువాయి

నమోదు చేసిన ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఆధారంగా, లబ్ధిదారుని బ్యాంక్ సీబీఎస్ నుంచి ఖాతాదారుడి పేరు బదిలీ చేసే వ్యక్తికి ఈ పేరు కనిపిస్తుంది. ఆ పేరు సరైనదేనని ధ్రువీకరించుకున్న తర్వాత చెల్లింపుదారుడు ట్రాన్సాక్షన్‌ను పూర్తి చేయవచ్చు. ఒకవేళ లబ్ధిదారుడి పేరు కనిపించకపోతే, ఆ ట్రాన్సాక్షన్ చేయాలా? వద్దా? అనేది చెల్లింపుదారుడి ఇష్టం. ఎలాంటి ఛార్జీలు లేకుండానే కస్టమర్లకు ఈ సేవను అందిస్తామని ఆర్బీఐ స్పష్టం చేసింది. కస్టమర్ల గోప్యతను దృష్టిలో ఉంచుకుని, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఈ సదుపాయానికి సంబంధించిన ఎలాంటి డేటాను నిల్వ చేయదు. డిజిటల్ చెల్లింపు వ్యవస్థను మరింత సురక్షితమైన, వినియోగదారు-స్నేహపూర్వకంగా మార్చడానికి ఆర్బీఐ ఈ ముఖ్యమైన చొరవ తీసుకుంటోంది. ఇది ఫండ్ ట్రాన్స్‌ఫర్‌లో తప్పులను తగ్గించడమే కాకుండా, కస్టమర్ విశ్వాసాన్ని కూడా పెంచుతుంది. ఒకవేళ ట్రాన్సాక్షన్ సంబంధిత వివాదాలు తలెత్తినప్పుడు, చెల్లింపుదారు బ్యాంక్, లబ్ధిదారుడి బ్యాంక్ వివాదాన్ని ప్రత్యేక లుకప్ రిఫరెన్స్ నంబర్, సంబంధిత లాగ్‌లను ఉపయోగించి పరిష్కరిస్తారని కూడా ఆర్బీఐ తెలిపింది.

## సైనిక్ స్కూల్స్ ఏర్పాటుపై విద్యా కమిషన్ చైర్మన్ లేఖ

మొదటి పేజీ తరువాయి

రాశారు. ఈ లేఖలో సైనిక్ స్కూల్స్ ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు ఇచ్చారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో సైనిక్ స్కూల్ ఏర్పాటు పై గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏంటి అనేది లేఖలో ప్రస్తావించారు. అంతేగాక ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలను, అనుసరించాల్సిన విధానాలను వివరిస్తూ ఆకునూరి మురళికి పలు కీలక సూచనలు చేశారు. ఇక కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే సైనిక్ స్కూల్స్ ను తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చేయాల్సిన ప్రయత్నాల నేపథ్యం, ఆవశ్యకత, అందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చేపట్టాల్సిన చర్యలను ఎంపీ వినోద్ కుమార్ రాసిన లేఖలో వివరించారు. కాగా తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సైనిక్స్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం ఇప్పటికే కేంద్రం వద్ద పలు మార్లు ప్రతిపాధనలు పెట్టింది.


## సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు శాశ్వత భవనాలు నిర్మిస్తాం

మొదటి పేజీ తరువాయి




మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. దశల వారీగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్ వ్యవస్థీకరణ చేపడతామన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్లు, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్లతో మంత్రి సమావేశమయ్యారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చే ప్రజలను గంటల తరబడి వెయిట్ చేసే పరిస్థితి లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో చాలా వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలు లేవని, అలాంటి వాటికి త్వరలోనే సొంత భవనాలు నిరిస్తామన్నారు. వాటి కోసం భూములు గుర్తించాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు.

## న్యూసెన్స్ చేసే వారికి తెలంగాణ వినూత్న హెచ్చరిక




హైదరాబాద్, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా నగరంలో కొంత మంది మద్యం సేవించి వాహనాలు నడపడం, న్యూసెన్స్, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేయడం చేస్తుంటారు. అలాంటి వారికి కోసం తెలంగాణ పోలీస్ ఎక్స్ వేదికగా వినూత్న హెచ్చరికలు పోస్ట్ చేసింది. న్యూఇయర్ సెలబ్రేషన్స్ కోసం పోలీసులు నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించండని సూచించారు. ఇతరులను ఇబ్బంది పెట్టినా, డ్రంక్ అండ్ డ్రైవ్ చేసినా, డ్రగ్స్ వాడినా జైలు పాలవ్వక తప్పదని హెచ్చరించారు. నిబంధనలను పాటించకపోతే ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. 'మీ కోసం జైల్లో న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ రెడీ, ప్రత్యేక ఆహ్వానితులు తాగి వాహనం నడిపేవాళ్లు, రోడ్లపై స్టంట్లు, అల్లరి చేసేవాళ్లు, ముఖ్య అతిథులు డ్రగ్స్ సేవించే వ్యక్తులు, మీ కోసం తెలంగాణ పోలీసులు బేడీలతో రెడీగా ఉన్నారు. సహాయం కోసం డయల్ 100 ను సంప్రదించండి అంటూ వినూత్న తీరులో పోస్ట్ చేశారు.

## అంతరిక్షంలోకి మహిళా రోబో



న్యూ ఢిల్లీ, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): భారత అంతరిక్ష రంగానికి 2024 ఒక ముఖ్యమైన సంవత్సరం అని పీఎంఓ, అణుశక్తి మరియు అంతరిక్ష శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఈ మధ్యాహ్నం న్యూ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ, మిస్టర్ సింగ్ మాట్లాడుతూ, సంవత్సరంలో మొదటి రోజు XPoSat ప్రారంభంతో ప్రారంభమైందని, ఆపై ఆదిత్య L1 మిషన్ దాని లక్ష్య హాలో కక్ష్యలో చేర్చబడిందని, దేశం తన తొలి జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఆగస్టులో జరుపుకుంది మరియు నిన్న SpaDeX మిషన్ జరిగింది. ఇస్రో ప్రయోగించింది. పైప్‌లైన్‌లో ఉన్న గగన్‌యాన్ కోసం ఈ మధ్య చాలా ట్రయల్స్ జరిగాయని ఆయన అన్నారు. డాక్టర్ సింగ్ మాట్లాడుతూ, ట్రయల్స్ దాదాపు పూర్తయ్యాయి మరియు మహిళా రోబోట్‌తో డ్రెస్ రిహార్సల్ ఈ ఏడాది ఎప్పుడైనా జరుగుతుంది. డాకింగ్ టెక్నాలజీకి సంబంధించి భారతదేశం చేపట్టిన మొదటి ప్రయోగాలలో స్పాడెక్స్ మిషన్ ప్రారంభించడం ఒకటని ఆయన అన్నారు. గగన్‌యాన్ మరియు భారతదేశం యొక్క స్పేస్ స్టేషన్ ప్రోగ్రామ్‌లోని తదుపరి భాగాలలో స్పేస్ డాకింగ్ సిస్టమ్ ఉపయోగించబడుతుంది. ఇది పూర్తిగా స్వదేశీ సాంకేతికత అని, అందుకే దీనికి భారతీయ డాకింగ్ టెక్నాలజీ అని పేరు పెట్టినట్లు మంత్రి తెలిపారు. ఇది ఆత్మనిర్భర్ భారత్ కోసం ప్రధాని నరేంద్ర మోదీ మంత్రానికి అనుగుణంగా ఉందని ఆయన అన్నారు. మరోసారి గర్వపడేలా చేసిన ఇస్రో బృందాన్ని డాక్టర్ సింగ్ అభినందించారు.

## రాష్ట్ర ప్రజలందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు

మొదటి పేజీ తరువాయి



యువత నిర్వీర్యరమవుతోందన్నారు. రాష్ట్రంలో, దేశంలో అత్యాచారాలకు, నేరాలకు మత్తు పదార్ధాల వాడకమే కారణమన్నారు. సొంత జీవితాలతో పాటు ఎదుటివారి జీవితాలను నాశనం చేసుకునే మత్తు పదార్ధాలను వినియోగానికి, వ్యసనాలకు కొత్త సంవత్సరం వేళ దూరంగా ఉండాలని నిర్ణయించుకుని తెలంగాణ ప్రజాప్రభుత్వం చేపట్టిన సే టూ నో డ్రగ్స్ కార్యక్రమంలో భాగస్వామ్యమై డ్రగ్స్ రహిత తెలంగాణ సాధనకు సహకరించాలని కోరారు. డ్రగ్స్ కు దూరంగా ఉందాం ఆరోగ్య తెలంగాణను నిర్మించుకుందామని పిలుపునిచ్చారు. సంతోషమైన జీవితం వేరు అర్థవంతమైన జీవితం వేరని, ఆ దిశగా యువత, ప్రజలు పాటుపడాలన్నారు. ఉత్తమ కుటుంబ, సామాజిక విలువలతో జీవితంలో ముందుకెళ్లాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ప్రాణాలమీదకు తెచ్చుకోవద్ధని కోరారు. రాష్ట్రంలో, దేశంలో అత్యాచారాలకు, నేరాలకు మత్తు పదార్ధాల వాడకమే కారణమన్నారు.

## డీజీపీ జితేందర్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక విజ్ఞప్తి

మొదటి పేజీ తరువాయి



భాగస్వామ్యం అయ్యేలా చూడాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. అంతేకాదు ప్రతి పాఠశాలలో ట్రాఫిక్ అవేర్నెస్ పై అవగాహన కల్పించాలని రోడ్డు భద్రతాపై ఆర్టీసీ రవాణా శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రోడ్డు భద్రతపై స్కూల్ విద్యార్థులతో అవగాహన ర్యాలీ, ట్రైనింగ్ క్లాసులు, వర్క్ షాప్‌లు, సెమినార్‌లు, కంటి చెకప్ క్యాంప్‌లు, డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల మరణాలను తగ్గించడానికి ఇప్పటికే రవాణా శాఖ పలు కార్యక్రమాలను చేపడుతోంది. ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేసే ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్‌లను జనవరిలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ జూమ్ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, జేటీసీలు, డీటీసీలు, ఆర్టీవోలు, ఆర్టీసీ ఈడీలు, ఆర్ఎంలు పాల్గొన్నారు.

## జనవరి 4న తెలంగాణ కేబినెట్ సమావేశం



మొదటి పేజీ తరువాయి

సహాయం, కొత్త రేషన్ కార్డులు, ఎస్సీ వర్గీకరణ, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల కోసం డెడికేటెడ్ కమిషన్ నివేదిక, యాదగిరిగుట్ట ఆలయ బోర్డు ఏర్పాటు సహా పలు కీలక అంశాలపై చర్చించే అవకాశం ఉంది. సంక్రాంతి నుంచే రైతుభరోసా పథకం అమలు చేస్తామని ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీలో ప్రకటించింది. ఈ నేపథ్యంలో రైతుభరోసా ఎవరికి ఇవ్వాలన్న దానితో పాటు కొత్త రేషన్ కార్డుల జారీకి మార్గదర్శకాల ఖరారుపై సమావేశంలో చర్చించి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. వ్యవసాయ యాంత్రీకరణ, వీఆర్వో వ్యవస్థ, భూభారతి అమలు వంటి అంశాలపై కూడా చర్చించనున్నట్లుగా సమాచారం.

## కేటీఆర్ పిటిషన్‌పై హైకోర్టులో ముగిసిన వాదనలు

మొదటి పేజీ తరువాయి




చేసింది. ఈ సందర్భంగా ఏసీబీకి హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. తీర్పు వచ్చే వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దని ఆదేశించింది. గతంలో కేటీఆర్‌ను అరెస్టు చేయకుండా ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. ఫార్ములా ఈ-కారు రేసింగ్ కేసులో తనపై ఏసీబీ నమోదు చేసిన కేసులను కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. పిటిషన్‌పై జస్టిస్ లక్ష్మణ్ బెంచ్ మంగళవారం విచారణ జరిపింది. కేటీఆర్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే వాదనలు వినిపించారు. ఈ కేసులో కేటీఆర్‌కు సెక్షన్ 409 వర్తించదని, ఫార్ములా-ఈ రేస్ వ్యవహారంలో నిధుల దుర్వినియోగం జరుగలేదని స్పష్టం చేశారు. సొంత ప్రయోజనాలకు ఆ నిధులను కేటీఆర్ వాడుకోలేదని మొత్తం వ్యవహారంలో కేటీఆర్ ఒక్క రూపాయి లబ్ధి పొందలేదని చెప్పారు. కేటీఆర్‌కు 409 అప్లయ్ చేస్తే గందరగోళం నెలకొనే అవకాశం ఉందని ఇకపై దేశంలో ఏ మంత్రి సైతం ఫైళ్లపై సంతకాలు చేయ-బోరన్నారు. అందుకు బాంబే హైకోర్టు నుంచి ఇప్పటి వరకు అన్ని కేసుల ఉదాహారణలను అందజేస్తామని చెప్పారు. అనుమతి తీసుకోలేదనే విషయానికి సెక్షన్ 405 వర్తించదని చెప్పారు. కేటీఆర్ మంత్రిగా నిర్ణయం తీసుకున్నారన్నారు. బ్యాంకింగ్ చానల్స్ ద్వారానే నిధులు ఆర్గనైజింగ్ సంస్థకు వెళ్లాయని ఏసీబీ అధికారులు చెబుతున్న రూ.8కోట్లు సైతం కేటీఆర్ ఖాతాలోకి వెళ్లవని ఆ డబ్బులన్నీ నిర్వాహకులకు వెళ్తాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కోర్టు బీఎన్ఎస్ వచ్చాక ఐపీసీ కింద ఎందుకు కేసు నమోదు చేశారని ఏసీబీని ప్రశ్నించింది. 14 నెలల కిందటనే నేరం జరిగిందని ఐపీసీ సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లుగా కోర్టుకు ఏసీబీ తరఫున ఏజీ తెలిపారు. డబ్బు చేరిన వ్యక్తిని నిందితుడిగా ఎందుకు చేర్చలేదని ఆ విదేశీ సంస్థ పేరు ఏంటని ప్రశ్నించింది. ఎఫ్ఈవో వివరాలను కేటీఆర్ తరపు న్యయవాది కోర్టుకు తెలిపారు. ఆ తర్వాత ఏసీబీ తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. రేసు వ్యవహారంలో ఒప్పందం జరుగక ముందే చెల్లింపులు చేశారని బ్రిటన్ పౌండ్ల రూపంలో రూ.46కోట్లు చెల్లించినట్లుగా చెప్పారు. రేసింగ్ వ్యవహారంలో సీజన్ 10 ఒప్పందానికి ముందే నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు చేసినట్లుగా ఏజీ కోర్టుకు తెలిపారు. ఈ సందర్భంగా కేసు విచారణ ఏ దశలో ఉందని కోర్టు ఏజీని ప్రశ్నించింది. కేసు విచారణ ప్రాథమిక దశలోనే ఉందని విచారణ జరిపితే అన్ని ఆధారాలు బయటపడుతాయని చెప్పారు. ఇప్పటికే ఫిర్యాదుదారుడైన దాన కిశోర్ వాంగ్మూలం నమోదు చేశామని ఏజీ చెప్పారు. నిందితులు అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి ఏమైనా పిటిషన్లు దాఖలు చేశారా? అని ప్రశ్నించింది. అయితే, ఎవరూ పిటిషన్లు దాఖలు చేయలేదని ఏజీ కోర్టుకు వివరించారు.

## ఈ విద్యా సం.లో మారనున్న ఇంటర్ అడ్మిషన్ల విధానం

మొదటి పేజీ తరువాయి

ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (జోస్ట్) విధానాన్ని సర్కార్ తీసుకురానుంది. వచ్చే విద్యాసంవత్సరం జూన్ నుంచి ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాలు ఆన్‌లైన్‌లోనే జరగనున్నాయి. పదో తరగతి మార్కుల ఆధారంగా మెరిట్‌ను బట్టి ప్రవేశాలు కల్పిస్తారు. అలాగే ఆన్‌లైన్‌లో విద్యార్థులు ఎంచుకున్న ఆప్షన్ల ప్రకారం సీట్లు భర్తీ చేస్తారు. ఇప్పటికే రాష్ట్రంలోని కాలేజీల్లో డిగ్రీ సీట్లను 'దోస్త్' ద్వారా భర్తీ చేస్తున్నారు. ఈ విధానంతో ప్రైవేట్ కాలేజీల ఆగడాలకు అడ్డుకట్టపడినట్లైంది. ఇదే తరహాలో ఇంటర్‌లోనూ ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు కల్పించనున్నారు. గతంలో పదో తరగతిలో గ్రేడింగ్ విధానం ఉండేది. దీంతో మెరిట్ ఆధారంగా సీట్లను కేటాయించలేని పరిస్థితి ఉండేది. కానీ ఈ ఏడాది నుంచి పదో తరగతి విద్యార్థులకు గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేస్తున్నట్లు రేవంత్ సర్కార్ ఇప్పటికే ప్రకటించింది. వచ్చే మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షలకు విద్యార్థులకు గ్రేడ్ల స్థానంలో మార్కులను జారీ చేస్తారు. కాగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 1200 పైచిలుకు ప్రైవేట్ కాలేజీన్నాయి. అయితే కొన్ని కార్పొరేట్ కాలేజీల్లో అడ్మిషన్ల పేరిట భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారు. పైగా పదో తరగతి పరీక్షలకు ముందే అడ్మిషన్లు చేపడుతున్నాయి. పైగా ఇంటర్ అడ్మిషన్ నోటిఫికేషన్ రాకముందే డిసెంబర్‌లోనే ముందస్తుగా ఈ ప్రక్రియను చేపడుతున్నాయి. ఇది నిబంధనలకు పూర్తిగా విరుద్ధం. దీంతో ప్రభుత్వ కాలేజీల్లో విద్యార్థుల చేరికలు అంతంత మాత్రంగా ఉంటున్నాయి. కొత్త విధానంతో ఆన్‌లైన్‌లో గుర్తింపు పొందిన కాలేజీల జాబితాను అందుబాటులోకి తెస్తారు. విద్యార్థులు ప్రాధాన్య క్రమంలో ఆప్షన్లు ఎంచుకోవాలి. ఆప్షన్లు, మెరిట్‌ను అనుసరించి సీట్లు కేటాయింపు ఉంటుంది. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలన్న తేడాల్లేకుండా ఒకేసారి అడ్మిషన్లు సకాలంలో పూర్తవుతాయి. ఆన్‌లైన్ అడ్మిషన్లతో విద్యార్థి తనకు నచ్చిన కాలేజీలో చేరే అవకాశం ఉంటుంది.

## అమిత్ షా పర్యటన అనంతరం దండకారణ్యంలో ఉద్రిక్త

మొదటి పేజీ తరువాయి

సర్చింగ్ ఆపరేషన్స్ నిర్వహిస్తున్నాయి. తాజాగా 2 వేల మంది భద్రతాబలగాలు చర్లమీదుగా తెలంగాణ అడవుల్లోకి వచ్చి కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించడం సంచలనం రేపుతోంది. వేలసంఖ్యలో కేంద్ర జవాన్లు తెలంగాణ అడవులను జల్లెడ పడుతుండటంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

**తెలంగాణనే సేఫ్ జోన్**

తెలంగాణ - ఛత్తీస్ ఘడ్ సరిహద్దుల్లోని సైనిక శిబిరాలపై మావోయిస్టులు ఆకస్మిక దాడులకు పాల్పడుతున్న నేపథ్యంలో మావోయిస్టులు తెలంగాణ అడవుల్లోకి ప్రవేశించి సేఫ్ జొన్లను రెక్కీ చేస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. 'ఆపరేషన్ కగార్' తారాస్థాయికి చేరుతుండటంతో తెలంగాణను సేఫ్ జోన్ గా మార్చుకునేందుకు మావోయిస్టులు యత్నిస్తున్నారనే సమాచారంతో కేంద్ర హోంశాఖ క్రాస్ బార్డర్ ఆపరేషన్స్ చేపడుతోంది.

**క్రాస్ బార్డర్ ఆపరేషన్లకు సిద్ధం.**

ఇక ఇటీవల మావోయిస్టుల అడ్డాలో పర్యటించిన అమిత్ షా దండకారణ్యంవ్యాప్తంగా కేంద్రబలగాలు, రాష్ట్ర పోలీసులు సమన్వయంతో పరస్పరం సహకరించుకోవాలని సూచించారు. అవసరమైతే క్రాస్ బార్డర్ ఆపరేషన్లకు సైతం సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే తెలంగాణలో మావోయిస్టుల కార్యాకలాపాలపై నిగూఢ సమాచారాన్ని సేకరించాలని రాష్ట్ర ఇంటలిజెన్స్, ఎస్ఐబీకి సూచనలు ఇచ్చారు. తెలంగాణలోకి ప్రవేశించిన మావోయిస్టులు విధ్వంసకరమైన ఘటనలకు పాల్పడుతారనే సమాచారం ఉందన్న పోలీసు అధికారులు తెలంగాణ గ్రేహౌండ్స్ లో ఏఎస్పి క్యాడర్లో పనిచేస్తున్న పదిమంది యువ ఐపీఎస్లను దండకారణ్యం జోన్లోకి ట్రాన్స్ ఫర్ చేసినట్లు సమాచారం.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# మళ్లీ కవ్విస్తున్న చైనా

భారత్ అభివృద్ధి చెందుతున్న విషయాన్ని చైనా జీర్ణించుకోలేకపోతోంది భారత్‌ను ఇబ్బందులు పెట్టే చర్యలకు చైనా సిద్ధమవుతోంది. ఒకవైపు భారత్ సరిహద్దు దేశాలను చంకనెత్తుకొని, రెచ్చ గొడుతూనే.. మరోవైపు, భారత్‌ను పరోక్షంగా ఇబ్బందులు పెట్టే చర్యలు చేస్తోంది. భారత సరిహద్దుకు సమీపంలో బ్రహ్మపుత్ర నదిపై ప్రపంచంలోనే అతి పెద్ద హైడ్రోపవర్ డ్యామ్‌ను నిర్మిస్తోంది. దీనితో, భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలైన అసోం, అరుణాచల్‌ప్రదేశ్‌లు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. చైనా వంకర బుద్ధి ఎప్పటికీ మారదేమో అన్నట్లే ఉంది. స్నేహం నటిస్తూనే గోతులు తీయడంలో చైనా చాకచక్యంగా వ్యవహరిస్తోంది. ఇటీవల, భారత్, చైనా బోర్డర్‌లో ఉన్న ఉద్రిక్తతలపై శాంతి ఒప్పందానికి ఓకే చెప్పిన చైనా.. ఆ తర్వాత, తన అసలు రూపాన్ని బయటపెట్టింది. ఇప్పటికే పాకిస్తాన్‌తో సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తున్న చైనా.. భారత్‌ను ఇబ్బంది పెట్టే విధంగా పాకిస్తాన్ నడుచుకోడానికి ఉసిగొల్పుతుంది. తాజాగా బంగ్లాదేశ్‌లో నెలకొన్న అంతర్గత సమస్య వెనుక కూడా చైనా కుట్ర దాగి ఉందనీ.. భారత్‌తో ఉన్న సత్సంబంధాలు క్షీణించేలా చైనా పావులు కదిపిందనే ప్రచారం జరుగుతోంది. మాల్దీవుల్ని, శ్రీలంకను కూడా కంట్రోల్ చేసే దిశగా చర్యలు చేపట్టింది. ఒకవైపు భారతదేశం చుట్టూ ఉన్న దేశాలతో వ్యాపార, వాణిజ్య, దౌత్యపరమైన సత్సంబంధాలను కొనసాగిస్తూ ఇబ్బందులు పెట్టే ప్రయత్నం చేస్తూనే.. మరోవైపు యుద్ధం వస్తే భారత్‌ను ఇక్కట్లకు గురి చేసే కీలక నిర్ణయాన్ని చైనా తీసుకుంటోంది. అరుణాచల్ ప్రదేశ్‌కు దగ్గరగా బ్రహ్మపుత్ర నదిపై అతిపెద్ద డ్యామ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ప్రపంచంలోనే అతిపెద్ద జల విద్యుత్తు డ్యామ్‌గా పేరున్న ఈ డ్యామ్.. త్రీ గోర్జెస్ డ్యామ్ కంటే మూడు రెట్లు పెద్దదిగా నిర్మించనుంది. తాజాగా, ఈ డ్యామ్ నిర్మాణానికి చైనా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. టిబెట్ ప్రాంతంలో భారత సరిహద్దుకు సమీపంలో ఈ డ్యామ్ నిర్మించేందుకు చైనా సిద్ధమవుతోంది. టిబెట్ తూర్పు అంచులో ఉన్న యార్లగు జాంగ్బో నది దిగువ భాగంలో ఈ జలాశయాన్ని నిర్మించనున్నట్లు చైనా మీడియాలో కథనాలు వెలువడ్డాయి. 137 బిలియన్ డాలర్ల వ్యయంతో ప్రపంచంలోనే అతిపెద్దన్రాజెక్టుగా ఈ డ్యామ్ నిలుస్తుందని పేర్కొంటున్నారు. ఈ ప్రాజెక్టు విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం 300 బిలియన్ కిలోవాట్ అవర్స్ అని.. 2020లో చైనా పవర్ కన్స్ట్రక్షన్ కార్పొరేషన్ అంచనా వేసింది. ప్రస్తుతం చైనాలో ఉన్న అతిపెద్దదైన త్రీ గోర్జెస్ డ్యామ్ సామర్థ్యం 88.2 విలియం కిలోవాట్ అవర్స్. అంటే కొత్త డ్యామ్ సామర్థ్యం దానికి మూడు రెట్లు అధికం. హిమాలయాల్లో పుట్టిన బ్రహ్మపుత్ర నది భారత్‌లోకి ప్రవేశించే ముందు అర్ధచంద్రాకారంలో వంగి ప్రవహిస్తుంది. నది పెద్ద యూటర్న్ తీసుకొని ఆరుణాచల్ ప్రదేశ్, అసోం గుండా బంగ్లాదేశ్‌లోకి ప్రవేశిస్తుంది. యూటర్న్ తీసుకునే ప్రాంతంలో భారీ లోయ దగ్గర ఈ డ్యామ్ నిర్మించాలని చైనా నిర్ణయించింది. 137 బిలియన్ డాలర్ల ఖర్చుతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టు ప్రపంచంలోనే అతి ఖరీదైన, భారీ ప్రాజెక్టుగా నిలుస్తుంది. అలాగే, బ్రహ్మపుత్ర నది అరుణాచల్‌ప్రదేశ్‌లో ప్రవేశించడానికి ముందు సుమారు 3 వేల మీటర్ల దిగువకు ప్రవహిస్తుంది. ఇక్కడ ప్రాజెక్టు నిర్మిస్తే భౌగోళికంగానూ చైనాకు అనుకూలంగా ఉంటుంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ విద్యుత్‌ను ఉత్పత్తి చేసే వీలుండటం వల్ల ఇక్కడే ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని చైనా భావిస్తున్నట్లు తెలుస్తోంది. యార్లాంగ్ జాంబ్బో నదిపై ప్రాజెక్టు నిర్మించాలని అనుకుంటున్న ప్రాంతం ప్రపంచంలోనే అత్యధిక జల విద్యుత్తును ఉత్పత్తి చేయగలిగే అవకాశం ఉన్నవాటిలో ఒకటి అని చైనా పవర్ కన్స్ట్రక్షన్ అంచనా వేసినట్లు తెలుస్తోంది. అయితే, జల విద్యుత్ ఉత్పత్తి కోసం బ్రహ్మపుత్ర నదిలోని సగం నీటిని దారి మళ్లించేందుకు 20 కిలోమీటర్ల పొడవైన సొరంగాలు? నాలుగు నుంచి ఆరు వరకు తవ్వాలని చైనా ప్లాన్ వేస్తోంది. నమ్ చా బార్వా కొండల్లో తవ్వే ఈ సొరంగాలు ద్వారా సెకనుకు 2000 క్యూబిక్ మీటర్ల నీరు ప్రవహిస్తుంది. రక్షణ పరంగానూ భారత్‌కు సమస్యలు పొంచి ఉన్నాయి. ఒకవేళ యుద్ధ పరిస్థితులు తలెత్తితే ప్రాజెక్టులో నిలువ చేసిన నీటిని ఒకేసారి విడుదల చేసి చైనా వాటర్ బాంబుగా ఉపయోగించే ప్రమాదం కూడా ఉందని నిపుణులు అంటున్నారు. అంత ఎత్తు నుంచి నీటిని విడుదల చేస్తే, భారత్‌లో ఈశాన్య ప్రాంతం అల్ల కల్లోలం అవుతుంది. అసోం, అరుణాచల్ వంటి రాష్ట్రాలు పూర్తిగా జల సమాధి అయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలోనే ఈ ప్రాజెక్టు నిర్మాణంపై ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రధాన నదుల్లో ఒకటైన బ్రహ్మపుత్ర నదిపై భారీ జల విద్యుత్ డ్యామ్ నిర్మాణంపై జిన్‌పింగ్ చాలా కాలంగా ప్లాన్లు గీస్తున్నారు. భారత్‌కు నష్టమని తెలిసినప్పటికీ సూపర్ డ్యామ్ నిర్మాణానికి తయారయ్యారు. గత కొన్నాళ్లుగా ఈ వ్యవహారంలో స్తబ్దుగాఉన్న చైనా ఇప్పుడు ఆ దిశగా చర్యలు వేగవంతం చేసింది. ఈ మేరకు ఆస్ట్రేలియన్ స్ట్రాటజిక్ పాలసీ ఇన్‌స్టిట్యూట్ ఓ నివేదికను విడుదల చేసింది. చైనా ఎత్తుగడలకు సంబంధించిన కీలక అంశాలను ఈ నివేదికలో పొందుపరిచింది. ఈ నిర్మాణంలో సవాళ్లను కూడా ఇందులో పేర్కొన్నారు. బ్రహ్మపుత్ర నదిపై ఇలాంటి భారీ డ్యామ్ నిర్మాణం భూకంపాలకు గురయ్యే టెక్టోనిక్ ప్లేట్ సరిహద్దులో ఉందని తెలుస్తోంది. టిబెటన్ పీఠభూమి టెక్టోనిక్ ప్లేట్‌ల పైన దాని స్థానం కారణంగా తరచుగా భూకంప కార్యకలాపాలకు లోనయ్యే అవకాశం ఉంది. కాబట్టి, ఈ డ్యామ్ నిర్మాణంలో భారీ ఇంజనీరింగ్ ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం కనిపిస్తోంది. ఇక, బ్రహ్మపుత్ర టిబెటన్ పీఠభూమి మీదుగా ప్రవహిస్తుంది. భారతదేశంలోకి ప్రవేశించే ముందు 25 వేల 154 అడుగుల అసాధారణ నిలువుగా ప్రపంచంలోని లోతైన లోయలో ప్రవహిస్తుంది. ఇక, 60 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగే ఈ మెగా ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే దిగువ ప్రాంతాలకు నీటికి కొరత ఏర్పడుతుందనే ఆందోళనలు ఉన్నాయి. అంతే కాకుండా వరదలు వంటివి సంభవించినప్పుడు గేట్లు ఎత్తేస్తే దిగువ ప్రాంతాలు కొట్టుకొని పోయే ప్రమాదం కూడా ఉంది. ఇంత ప్రమాదకర పరిస్థితుల్లో కూడా? ఈ ప్రాజెక్టు గురించి ఇప్పటివరకు భారత్‌కి చైనా ఎలాంటి సమాచారం అందించలేదు. ఇక, చైనా అభివృద్ధి పేరుతో చేపట్టిన మొత్తం 60 ప్రాజెక్టులకు సంబంధించిన ప్రతిపాదనల్లో ఇది కూడా ఒకటి. ఇక, అరుణాచల్ ప్రదేశ్‌లో సియాంగ్ నదిగా పేర్కొనే బ్రహ్మపుత్రా నదిని సజీవంగా ఉంచాలనే డిమాండ్ అరుణాచల్ ప్రభుత్వం ఎప్పటి నుండో చేస్తోంది. చైనా ఈ నది ప్రవాహాన్ని మళ్లిస్తే, సియాంగ్ సైజు తగ్గిపోతుందనీ.. పెద్ద మొత్తంలో విడుదలయ్యే వరద నీటికి సియాంగ్ లోయ తీవ్రంగా ప్రభావితం కానుందనే ఆందోళనలు పెరుగుతున్నాయి.

# మాతృత్వం గొప్ప వరం - అందుకు దత్తత ఓ మార్గం

### జిల్లా సంక్షేమాధికారిణి శ్రీమతి కూచన శిరీష




ములుగు జిల్లా, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): మంగళవారం జిల్లా కేంద్రం లోని బాల రక్షా భావనలో దత్తత పై దత్తత కొరకు దరఖస్తు చేసుకున్న తల్లితండ్రులకు అవగాన మరియు సాంకేతిక సహకార కార్యక్రమం జరిగినది. పరిరక్షణ అధికారి హరికృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమాధికారిణి కూచన శిరీష ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాతృత్వం గొప్ప వరం అని అందుకు దత్తత ఓ మార్గం అన్నారు. తల్లితండులు పోషించలేక లేదా కొన్ని భాధాకరమైన సందర్భాలలో పసి పిల్లలను విడిచి పెట్టి వెళుతుంటారని, అలాంటి చిన్నారులను చేరదీసి మహిళాభివృద్ధి శిశు సంక్షేమ ఆధ్వర్యం లో సంరక్షించడం జరుగుతుందని అన్నారు. ఈ చిన్నారులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వానికి పెద్ద భారం కాదాని, కానీ తల్లి ప్రేమను, తండ్రి ఆప్యాయతలను ఆ పిల్లల హక్కు కాబట్టి వారికి అవి చూడడం కొరకు ప్రభుత్వం పారదర్శకమైన పద్దతిలో ఆన్ లైన్ విధానం లో దత్తత కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, తద్వారా ఎలాంటి అపోహలకు తావులేకుండా చట్టబద్ధమైన విధానంలో పిల్లలు ప్రభుత్వం నుండి దత్తతకు ఇవ్వబడుతారని తెలిపారు. ప్రభుత్వం ద్వారా చట్టబద్ధమైన దత్తతను చేసుకోని వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని అన్నారు. అనంతరం పరిరక్షణాధికారి హరికృష మాట్లాడుతూ దత్తత మార్గదర్శకాలను ఈ కార్యక్రమం లో పాల్గొన్న దత్తతకోరు తల్లితండ్రు లకు వివరించారు. ముఖ్యంగా దత్తత రకాలు, దత్తతకు అర్హత, దత్తత ఇచ్చే క్రమంలో అనుసరించు విధానాలు, దత్తత సందర్భంగా పాటించా ల్సిన జాగ్రత్తలు, దత్తత అనంతరం పిల్లల పోషణ, సంరక్షణ మరియు వారితో వ్యవహరించవలసిన విధానం గురించి వివరించారు. ముఖ్యం గా రక్త సంబంధీకుల మధ్య జరిగే దత్తతని కూడా ఆన్ లైన్ లో కర పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని లేదా అది కూడా చట్టబద్ధం కానీ దత్తత క్రిందకే వస్తుందని తెలిపారు. ఆనంతరం సందేహాలను నివృత్తి చేశారు. చివరగా ఆన్ లైన్ లో వారి సీనియారిటీ ని స్థితిని తెలిపారు. ఈ కార్యక్రమం లో పరిరక్షణ అధికారి పి. కృష్ణవేణి, ఎల్సీపీఓ డి. సంజీవ, సీహెచ్ఎల్ కౌన్సిలర్ ఎం. రజిని, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది ఎన్. స్వప్న, డీసీపీయూ సిబ్బంది సదయ్య, రాజు, దత్తత కోరు తల్లితండ్రులు మరియు దత్తత తీసుకున్న తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు

### - జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2025 సంవత్సరం అందరికీ శాంతి, సంతోషం, ఆరోగ్యం, అభివృద్ధి కలిగించాలని ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన చిట్ట చివరి కుటుంబం వరకు చేరేలా అన్ని శాఖల అధికారుల సమిష్టి కృషితో ముందుకు ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. ఈ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరి జీవితాలు ఆనందమయం కావాలని అన్నారు. జిల్లా అభివృద్ధిలో ఆదర్శంగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. అధికారులకు బొకేలు, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలపడం సహజమని, అయితే వాటికి బదులుగా పేద విద్యార్థులకు ఉపయోగపడేలా నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర సామగ్రి ఇవ్వాలని ఆయన సూచించారు. శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే వివిధ శాఖల అధికారులు, తదితరులు బొకేలు, పుష్ప గుచ్ఛాలకు బదులు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు వంటివి అందించి పేద విద్యార్థులకు చేదోడు వాదోడుగా నిలవాలని తెలిపారు. త్వరలోనే వాటిని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# అక్రమ స్కానింగ్ సెంటర్ లపై ప్రత్యేక నిఘా

### - గర్భస్థలింగ శిశు నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు



మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): మంగళవారం కలెక్టరేట్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా స్థాయి పిసి అండ్ పీఎన్ డిటి కమిటీ సమావేశం జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి. మురళీధర్ అధ్యక్షతన సంబంధిత కమిటీ సభ్యులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ జిల్లాలో నూతనంగా దరఖాస్తు చేసుకున్న స్కానింగ్ , ఇమేజింగ్ సెంటర్లు, ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం కమిటీ సభ్యుల పరిశీలన తనిఖీ అనంతరం మంజూరు చేయాలని, ఆయా సెంటర్లలో అర్హత కలిగిన రేడియాలజిస్టులను లేడీ అటెండెరు, విశ్రాంతి ప్రదేశం, టాయిలెట్స్ , త్రాగునీరు తదితర సౌకర్యాలు, ప్రభుత్వం సూచించిన చెక్ లిస్ట్ ప్రకారం ఉన్న తర్వాతనే అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందని, జిల్లాలో అవసరం లేకున్నా స్కానింగ్లు చేస్తే వారిపై ప్రత్యేక నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. పట్టణంలో ఉన్న (34) స్కానింగ్ సెంటర్లు ను కమిటీ సభ్యులు తరచుగా తనిఖీ నిర్వహిస్తూ ఓపి నమోదు వివరాలను, తనిఖీ చేయాలని, స్కానింగ్ కు సంబంధించిన సేవల కోసం వచ్చిన వారి వివరాలు తెలుసుకోవాలన్నారు. ఈ మధ్యన నేషనల్ ఇన్స్పెక్షన్ మానిటరింగ్ కమిటీ జిల్లాలో పర్యటించి వారు చేసిన సూచనల పైన కూడా చర్చించడం జరిగింది. జిల్లాలోని నాలుగు పురపాలక సంఘాలు, ఏజెన్సీలు, అన్ని మండలాల్లో ప్రజలకు అవగాహన కలిగే విధంగా, కళాజాతుల ద్వారా, పెయింటింగ్స్, వాల్ పోస్టర్స్, లతో ప్రచారం నిర్వహించాలని, అంగన్వాడి, ఆశా కార్యకర్తల క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించే విధంగా సంబంధిత సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా స్థాయి కమిటీ సభ్యులు, వైద్య ఆరోగ్య, పోలీస్, రెవెన్యూ, శాఖలు స్కానింగ్ సెంటర్లో, నిర్వహణ పై నిఘా పెట్టీ సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సారంగం, కమిటీ సభ్యులు పీడియాట్రిషన్ డాక్టర్ జగదీశ్వర్, గైనకాలజిస్ట్ డాక్టర్ చైతన్య స్రవంతి, సిడబ్ల్యూ సి చైర్పర్సన్ డాక్టర్ నాగవాణి, గవర్నమెంట్ ప్లీడరు నగేష్ కుమార్, సిడిపిఓ శిరీష, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, డిప్యూటీ మాస్ మీడియా ఆఫీసర్ ప్రసాద్, ఆరోగ్య విద్యా బోధకుడు కెవి రాజు, అరుణ్ కుమార్, మనోహర్ , పాల్గొన్నారు.

# దళితులపట్ల రాజ్యాంగం పట్ల బిజెపికి చిత్తశుద్ధి లేదు

### - రాజ్యంగంపై బీజేపీకి ఉన్న గౌరవం తెటతెల్లమయింది
### - అమిత్ షా ను వెంటనే మంత్రి పదవి నుండి తొలగించాలి
### - డీఎస్ఎస్ జాతీయ కోఆర్డినేటర్ నల్ల రాధకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు




జవహర్ నగర్, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): దళిత వర్గానికి చెందిన అంబేద్కర్ రాజ్యాంగం రాసినందుకే బీజేపీకి నచ్చడం లేదని, అంబేద్కర్ ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్‌అను మంత్రివర్గం నుంచి వెంటనే భర్తరఫ్ చేయాలని డీఎస్ఎస్ జాతీయ కోఆర్డినేటర్ నల్ల రాధకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రగుడ్ల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. అంబేద్కర్పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్షాను బీజేపీ పార్టీ నుంచి తొలగించాలని కోరుతూ దళిత సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రగుడ్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం జవహర్నగర్ కార్పొరేషన్లోని అంబేద్కర్ ప్రధాన చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా దళిత సంఘర్షణ సమితి జాతీయ కోఆర్డినేటర్ నల్ల రాధాకృష్ణ హాజరై మాట్లాడుతూ దళితులు, రాజ్యాంగంపై బీజేపీకి ఏమాత్రం గౌరవం లేకపోవడం సిగ్గుచేటని, దేశంలోని అన్ని కులసంఘాలు, పార్టీలు నిరసనలు తెలిపిన అమిత్‌అపై చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందని ఎద్దవ చేశారు. దళితవర్గాలు ఇప్పటికైన మేల్కొని బీజేపీపై పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్పై చేసిన వ్యాఖ్యలకు కేంద్రమంత్రి అమిత్ క్షమపణలు తెలిపేవరకు నిరసలు రాష్ట్ర వ్యాప్తంగా చేపడతామని డీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రగుడ్ల వెంకటేశ్వర్లు అన్నారు. రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు బీజేపీ పెద్దకుట్ర చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి బొల్లా పద్మారావు ముదిరాజ్, నాయకులు నగేష్, పరమేశ్చారి, నాగరాజు, నాగేశ్వరరావు, విష్ణు, ఉపేందర్, శాంతారామ్, మహేష్, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు




### కలెక్టర్ డాక్టర్ సత్య శారదా

వరంగల్ జిల్లా, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): జిల్లా అభివృద్ధిలో భాగంగా 2024 మిగిల్చిన మధురస్మృతులు విజయాలను గుర్తుచేసుకుంటూ, వాటి కోసం కష్టించిన వారందరికీ కలెక్టర్ డాక్టర్ సత్య శారదా ధన్యవాదాలు తెలిపారు. కొత్త సంవత్సరం 2025 లో, ప్రజలందరికి సుఖ సంతోషాలు కలగాలని, చేపట్టిన పనులన్నీ నిర్విఘ్నంగా విజయవంతం కావాలని, వరంగల్ జిల్లా అభివృద్ధిలో పోటీపడుతూ మరిన్ని విజయాలు సాధించాలని కలెక్టర్ ఆకాక్షించారు.

# జిల్లా ప్రజలకు ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు

### జిల్లా కలెక్టర్ ప్రావిణ్య



హనుమకొండ జిల్లా, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): ఆంగ్ల నూతన సంవత్సరం 2025 ను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ ప్రావిణ్య జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అన్ని తరగతుల విద్యార్థులు బాగా చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అదే విధంగా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండాలని, నూతన సంవత్సరంలో మరింత అభివృద్ధి సాధించాలని చెప్పారు. రానున్న కొత్త సంవత్సరం 2025లో హనుమకొండ జిల్లాను ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు అందరి సహకారంతో మరింత ముందుకు తీసుకు వెళ్ళేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు. అభివృద్ధిలో జిల్లా ప్రజలందరూ సహకారమందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# సీఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడలకు జిల్లా నుంచి 24 మంది తరలింపు



### జిల్లా క్రీడల శాఖ అధికారి వెంకట్ రెడ్డి

జనగామ జిల్లా, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): సీఎం కప్ - 2024 టోర్నమెంట్ లో భాగంగా హైదరాబాదులోని గచ్చిబౌలిలో గల జీఎంసీబీ స్పోర్ట్స్ స్టేడియంలో 2025, జనవరి 1, 2వ తేదీల్లో (రెండు రోజుల) పాటు నిర్వహించే రాష్ట్ర స్థాయి పారా క్రీడలకు జిల్లా నుంచి ఎంపికైన (24) మంది దివ్యాంగ క్రీడాకారులను జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం నుంచి క్రీడల శాఖ అధికారి వెంకట్ రెడ్డి పచ్చ జెండా ఊపి తరలించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగ క్రీడాకారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రైలు కార్యకలాపాల నిర్వహణలో భద్రతా చర్యలపై సమీక్ష

### - దక్షిణ మధ్య జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్

హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ రైలు కార్యకలాపాల భద్రత మరియు సమయపాలనపై తీసుకోవలసిన చర్యలపై సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సమీక్ష నిర్వహించారు. అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగ్రవాల్, వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులతో పాటు మొత్తం 6 డివిజన్లు అనగా సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజనల్ రైల్వేమేనేజర్లు (డీఆర్ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమీక్షాసమావేశంలో పాల్గొన్నారు. జనరల్ మేనేజర్ జోన్‌లో రైళ్ల రాకపోకల భద్రతపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. భద్రతకు సంబంధించిన సిగలింగ్, ఇంజనీరింగ్, స్టేషన్ ఆస్తుల కు సంబంధించిన భద్రత సంబంధిత ఆస్తుల పనితీరుపై దృష్టి సారించి క్షేత్ర స్థాయి తనిఖీలను ముమ్మరం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

# భారీగా మొక్కలు నాటాలి: జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): మంగళవారం కొత్తగూడెం మున్సిపల్ పరిధిలో ని రామవరం లో ఉన్న మాతా శిశు ఆరోగ్య కేంద్రం బయట మొక్కల ప్లాంటేషన్ చేయడానికి స్థలాన్ని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పరిశీలించారు. మాత శిశు ఆరోగ్య కేంద్రం బయట ఉన్నటువంటి 1.5 ఎకరాల కాళీ భూములు మొక్కలు నాటాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీ ప్రదేశంలో భారీగా మొక్కలు నాటాలని అధికారులకు ఆదేశించారు. ఉన్నటువంటి ఖాళీ ప్రదేశాన్ని మూడు భాగాలుగా విభజించి ఔషధ మొక్కలు, సుందరీకరణ మొక్కలు మరియు భారీ వృక్షాలను నాటాలని అధికారులకు సూచించారు. మాతా శిశు కేంద్రానికి వచ్చే రోగులు మరియు ప్రజలకు నీడనిచ్చేలా మరియు ఆరోగ్య కేంద్రం అందంగా ఉండేలా సుందరీకరించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా వర్షం నీరు నిలవకుండా, నీరు భూమిలోకి ఇంకే విధంగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని, రానున్న వర్షాకాలంలోపు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషంజన్ స్వామి, మున్సిపల్ డి ఈ రవి కుమార్ మరియు 8,9 వార్డు కౌన్సిలర్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

**– పదవతరగతి లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాదించాలి**

**– బాలెంల హైస్కూల్ ని సందర్శించిన జిల్లా కలెక్టర్**

సూర్యాపేట, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): సూర్యాపేట రూరల్ పరిధిలో గల బాలెంల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తెలంగాణ రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సిలబస్ నిర్దేశించిన సమయానికి పూర్తి చేసి పదవ తరగతి లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ ఏర్పాటు చేసుకోవలని సూచించారు. కంప్యూటర్ ల్యాబ్ లో ఉన్న 6 వ తరగతి విద్యార్థులని పలు ప్రశ్నలు అడగగా విద్యార్థులు చెప్పిన సమాధానాలకి జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. 9వ తరగతి విద్యార్థులకి ఫిజిక్స్ సబ్జెక్ట్ పై పలు ప్రాబ్లమ్స్ వేయగా అందరు ఆ ప్రాబ్లమ్స్ కి సరైన సమాధానం చెప్పగా కలెక్టర్ విద్యార్థులని మెచ్చుకున్నారు. 10 వ తరగతి విద్యార్థుల క్లాస్



నోట్స్ పరిశీలించగా రైటింగ్ బాగుందని అలాగే ఇంగ్లీష్ లో విద్యార్థులు చక్కగా మాట్లాడటంతో కలెక్టర్ మెచ్చుకున్నారు. విద్యార్థులకి నాణ్యమైన భోజనం అందించాలని, పాఠశాలలో శానిటేషన్ చేసి పరిశుభ్రంగా ఉంచాలని, పాఠశాల కి మరల వస్తా అని కలెక్టర్ తెలిపారు. తెలంగాణ పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకి పాఠశాల స్థాయి లోనే కంప్యూటర్ లో స్కిల్స్ నేర్చుకుంటే భవిష్యత్ లో ఉన్నత స్థానానికి ఎదగవచ్చు అన్ని పాఠశాలలో ఉన్న కంప్యూటర్ ల్యాబ్ బాగుందని అభినందించారు. ఈ కార్యక్రమం లో డి ఈ ఓ అశోక్, ఎం ఈ ఓ శ్రీనివాస్, ప్రధాన ఉపాధ్యాయులు ప్రసాద్, ఉపాధ్యాయులు సోమశేఖర్, సైదులు, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

# కులగణన ఆధారంగా స్థానిక ఎన్నికల్లో బిసిలకు రిజర్వేషన్లు కేటాయించాలి

**– అచ్చునూరి కిషన్ ముదిరాజ్ మెపా జిల్లా అధ్యక్షులు**

ములుగు, డిసెంబర్ 31 (తీన్మార్ న్యూస్): మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలో మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొపెషినల్స్ అసోసియేషన్) జిల్లా కార్యాలయంలో మెపా జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల నాగరాజు ముదిరాజ్ అధ్వర్యంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మెపా జిల్లా అధ్యక్షుడు అచ్చునూరి కిషన్ ముదిరాజ్ విచ్చేసి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎన్నికల ముందు కామారెడ్డిలో ప్రకటించిన బిసి డిక్లరేషన్, మేనిఫెస్టో లో తెలిపిన ప్రకారం, అలాగే కులగణన ఆధారంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు అత్యధికంగా రిజర్వేషన్లు కేటాయించాలని, బిసిల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అనే విధంగా స్థానిక రిజర్వేషన్ల కేటాయింపు జరగాలని, కామారెడ్డి బిసి డిక్లరేషన్ కు కట్టుబడి ఉండాలని, మేము ఎంతో మాకు అంత" అనేది కాంగ్రెస్




పార్టీ ప్రభుత్వం గుర్తెరిగి అత్యధిక శాతం రిజర్వేషన్లు బిసిలకు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడం జరుగుతుంది అని కిషన్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెపా జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల నాగరాజు ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు భూమ నరేష్ ముదిరాజ్, వెంకటాపుర్ మండల అధ్యక్షుడు మేకల రమేష్ ముదిరాజ్, కల్లెబోయిన కిరణ్ ముదిరాజ్, కుక్కల కౌశిక్ ముదిరాజ్, పండు ముదిరాజ్, రఘు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్య ఏదైనా కొట్లాడేది ఎర్రజెండానే..

**– ప్రజలు వామపక్షాలను కోరుకుంటున్నారు**

**– సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభకు చారిత్రాత్మక ప్రాధాన్యత : సంగారెడ్డిలో 'మీట్ ది ప్రెస్'లో ఎస్.వీరయ్య**

మెదక్: "రాష్ట్రం వామపక్షాలను కోరుతోంది. ఇప్పుడు ఎర్రజెండా అవసరం ఏర్పడింది. ఇన్నాళ్లు బీఆర్ఎస్ పాలన చూశాం. తాజాగా ఏడాదిపాటు కాంగ్రెస్ పాలననూ చూశాం. కేంద్రంలో బీజేపీ అధికారం చెలాయిస్తోంది. వీరి పాలనలో తెలంగాణ ప్రజల జీవితాలు బాగు పడలేదు. మూడు పార్టీలకూ పెద్దోళ్లు, సంపన్నుల ప్రయోజనాలు తప్ప కార్మికులు, కర్షకులు, పేదల సంక్షేమం పట్టలేదు. ప్రజల జీవితాలను, ప్రజాస్వామ్య విలువలను గాలికొదిలేశారు. ప్రత్యామ్నాయ విధానాలతో ప్రజల పక్షాన కొట్లాడుతున్న ఎర్రజెండా, సీపీఐ(ఎం) అధికారంలోకి వస్తేనే రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రం మార్పు.. ప్రజల జీవితాల్లో మౌలికమైన మార్పులు సాధ్యం' అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. జనవరి 25–28 తేదీల్లో సంగారెడ్డిలో జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో "మీట్ ది ప్రెస్" నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డిలో జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభకు చారిత్రాత్మక ప్రాధాన్యత ఉందన్నారు. తెలంగాణ ముఖ చిత్రాన్ని మార్చేందుకు అవసరమైన రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతికాంశాలను చర్చించి తగిన తీర్మానాలు, నిర్ణయాలు చేయనున్నట్టు తెలిపారు. కార్మికుల కనీస వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండా మాత్రమే కొట్లాడిందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ ఏనాడూ కార్మికుల కష్టాల గురించి పట్టించుకోలేదని




ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎర్రజెండా నాయకత్వంలో లక్ష గుడెసెలేయించి ఇండ్లు లేని పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలివ్వాలని సీపీఐ(ఎం) పోరాడిందని గుర్తు చేశారు. ప్రజల పక్షాన పోరాడితే గత ప్రభుత్వం కేసులు పెట్టిందని, తాము అధికారంలోకి రాగానే కేసుల్ని కొట్టేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని విస్మరించారని అన్నారు. ఏడాది పాలన చూస్తే పచ్చి అవకాశవాదమే కనిపిస్తోందన్నారు. మెదక్, కొమురంబీం ప్రాంతాల్లో బీజేపీ మత కల్లోహాలు లేపి అల్లర్లు చేస్తే.. కాంగ్రెస్, బీఆర్ఎస్ కనీసం ఖండించలేద న్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలంటే సీపీఐ(ఎం) బలపడాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. మరోపక్క సామాజికంగా జరుగుతున్న వివక్ష, దాడులకు వ్యతిరేకంగా కూడా సీపీఐ(ఎం) మాత్రమే బాధితుల పక్షాన నిలబడి పోరాడిందన్నారు. కులదురహంకార హత్యలు, దాడుల్ని బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్‌లో ఒక్కరోజైనా తప్పుపట్టిన పరిస్థితి లేదన్నారు. రాజకీయాల కోసం మాత్రం మూడు పార్టీలు అంబేద్కర్ పేరును వాడుకుంటున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో సామాజిక దాడులు జరుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం కులదురహంకార చర్యలకు వ్యతిరేకంగా కనీసం ప్రచారమైనా చేయడం లేదన్నారు.

# కంటైనర్ బీభత్సం

**– మూడు డీసీఎంలు, టాటా ఏసీ, ద్విచక్ర వాహనం, పోలీస్ రక్షక వాహనాన్ని ఢీకొట్టిన కంటైనర్**

**– డీసీఎం డ్రైవర్ మృతి**

**– మరో ముగ్గురికి గాయాలు**

**– హైదరాబాద్ ముషీరాబాద్ చౌరస్తాలో ఘటన**

ఓయూ: రోడ్డు మీద పార్కు చేసి ఉన్న వాహనాలపైకి కంటైనర్ వాహనం దూసుకెళ్లి బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందారు. ఈ ఘటనలో పోలీస్ వాహనం సహా ఆరు వాహనాలు ధ్వంసమయ్యాయి.

ఈ సంఘటన హైదరాబాద్ చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముషీరాబాద్ చౌరస్తాలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఇన్‌స్పెక్టర్ అనుదీప్, ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం..

మేడ్చల్ మనీరాబాద్‌కు చెందిన వరప్రసాద్ తన డీసీఎం వాహనంలో సరుకులు లోడుచేసుకుని ముషీరాబాద్‌కు వెళ్తున్నాడు. ముషీరాబాద్ చౌరస్తాకు చేరుకోగానే టైరు పంక్చర్ అయింది. దాంతో విషయాన్ని అబ్దుల్లా అనే వ్యక్తికి ఫోన్ చేసి చెప్పడంతో ఉప్పల్‌లో ఉన్న అతను స్టెప్నీ టైరును మరో డీసీఎం వాహనంలో వేసుకుని వచ్చి, ఆ వాహనాన్ని పంక్చర్ అయిన డీసీఎం వెనుకనే నిలిపాడు. టైరు మార్చేందుకు జాకీ లేకపోవడంతో గాంధీ ఆస్పత్రి సమీపంలో లారీల వద్దకు వెళ్లి అక్కడ అఖిల్, అహ్మద్ దగ్గర జాకీని తీసుకొని, వారిని కూడా తోడుగా తీసుకొచ్చారు. వెంట వచ్చిన సహాయకులతో కలిసి వరప్రసాద్ టైరు మార్చే పనిలో ఉండగా.. అబ్దుల్లా సెల్‌ఫోన్ లైట్ పెట్టి నిలబడ్డాడు.



ఇంతలో రెడీమిక్స్ వాహనం వేగంగా దూసుకొచ్చి రెండు డీసీఎంలను బలంగా ఢ కొట్టింది. దాంతో అవి ముందుకు కదిలి వరుసగా ఉన్న మరో డీసీఎం, టాటా ఏసీ, సహాయకులకు చెందిన యాక్టివా ద్విచక్ర వాహనం, ఆ తర్వాత పార్క్ చేసిన ముషీరాబాద్ ఠాణాకు చెందిన పోలీస్ వాహనాన్ని ఢకొట్టింది. ఈ క్రమంలో అబ్దుల్లా మీదకు ఓ వాహనం దూసుకు రావడంతో అతను తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. వరప్రసాద్‌కు కూడా తీవ్రగాయాలు కాగా.. అఖిల్, అహ్మద్ స్వల్పంగా గాయపడ్డారు. వారిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

మృతిచెందిన అబ్దుల్లాది బీహార్ రాష్ట్రంలోని మధుబని జిల్లా అంధ్రాతడే గ్రామం. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ములుగు మండలం బండమైలారంలో ఉంటూ వరప్రసాద్ వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ముషీరాబాద్ పోలీసులు తనిఖీలు చేపట్టేందుకు చౌరస్తాకు వచ్చి పెట్రోలింగ్ వాహనాన్ని పార్కు చేసి వెళ్లిన కొద్దిసేపటికే ఈ ప్రమాదం జరిగింది. రెడీ మిక్స్ వాహన డ్రైవర్ మద్యం సేవించలేదని, ఆ సమయంలో నిద్ర వచ్చినందన ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చునని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

# విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా సమ్మె విరమించండి

**– సమగ్ర శిక్ష ఉద్యోగులు విధుల్లో చేరండి**

**– సమస్యలను పరిష్కరించాలని సీఎం దృష్టికి తీసుకెళ్తాం : మంత్రులు పొన్నం, సీతక్క**

హైదరాబాద్: రాష్ట్రంలో గత 25 రోజులుగా సమ్మె చేస్తున్న దాదాపు 19,500 మంది సర్వ శిక్షా ఉద్యోగులు కేజీబీవి ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుతోపాటు వారి శ్రేయస్సు దృష్ట్యా తక్షణమే సమ్మె విరమించాలని మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క కోరారు. సమ్మె చేయడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారనీ, కేజీబీవీ పాఠశాలల్లో బడుగు బలహీన వర్గాల పిల్లలు చదువుతున్నారని గుర్తు చేశారు. సమ్మె చేస్తూ వారిని అక్కడ చదువుతున్న విద్యార్థులను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేయొద్దని సర్వ శిక్ష ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు. సమ్మె విరమించి విధుల్లో చేరాలని కోరారు. సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నాయకులతో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క సోమవారం హైదరాబాద్‌లో చర్చలు జరిపారు.

ఈ సందర్భంగా వారు సుదీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రులకు నాయకులు వివరించారు. తాము కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో సుదీర్ఘకాలంగా చేస్తున్నామనీ, రెగ్యులరైజ్ చేయడం లేదా ఉద్యోగ భద్రతతో కూడిన పే స్కూల్ అమలు చేయాలని మంత్రుల దృష్టికి తెచ్చారు. కేంద్రం పరిధిలో 60 శాతం రాష్ట్రం పరిధిలో 40 శాతం నిధులను భరించాల్సి ఉంటుందనీ, ఇప్పటికే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్య తెలంగాణలోనే లేదనీ, దేశవ్యాప్తంగా ఉందని కేంద్ర ప్రభుత్వం కోరితే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి కేంద్రానికి ప్రతిపాదనలు పెడతామని వెల్లడించారు. 25 రోజులుగా కేజీబీవీ ఉపాధ్యాయులు సమ్మె చేయడం వల్ల వారికి విద్యాబోధన జరగక విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారనీ, తక్షణమే సమ్మె విరమించి



ఉద్యోగులు విధుల్లో చేరాలని కోరారు. సమ్మె విరమిస్తే వారి సమస్యలపై ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో ఏర్పడిన ఉపసంఘంతో సమావేశానికి పిలుస్తామని వివరించారు.


ఆ కమిటీలో తనతోపాటు మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారు కేశవరావు కూడా ఉన్నారని చెప్పారు. అందులో సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యల పై చర్చిస్తామన్నారు. ఆర్థికరేతర సమస్యలైన మహిళా ఉద్యోగులకు మెటర్నిటీ సెలవులు, సీఎల్స్ తదితర వాటిపై సాధ్యమైనంత వరకు ప్రభుత్వం పరిష్కరమయ్యేలా చూస్తుందని హామీ ఇచ్చారు. ఆర్థికపరమైన డిమాండ్లపై మంత్రివర్గ ఉపసంఘంలో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ ఈవి నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి, పీఆర్టీయూటీఎస్ అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కటకం రమేష్, ఎం అంజిరెడ్డి, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య, అసోసియేట్ ప్రెసిడెంట్ సురేందర్, సహదేవ్, నాయకులు ఖాదర్‌పాషా, క్రాంతి, అనిల్‌చారి తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులు కేసు విత్ డ్రా దిశగా అడుగులు

హైదరాబాద్: పుష్ప 2 సినిమా రిలీజ్ రోజున సంధ్య థియేటర్ దగ్గర జరిగిన తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందింది. అయితే ఈ విషయం మీద చాలామంది సినీ రాజకీయ ప్రముఖులు సైతం రకరకాలుగా స్పందిస్తూ వస్తున్నారు. ఇక ఈ ఘటనలో అల్లు అర్జున్ మీద కేసు నమోదైంది. మరి ఏది ఏమైనా కూడా ఈ విషయంలో ఆయన జైలుకు వెళ్తాడా అంటూ కొంతమంది కొన్ని రకాల కామెంట్లు అయితే చేస్తున్నారు. ప్రస్తుతం మధ్యంతర బేయిల్ మీద బయట తిరుగుతున్న ఆయన ఆ గడువు ముగిసింది. కాబట్టి జనవరి 10వ తేదీన హైకోర్టులో హాజరు కాబోతున్నట్టుగా తెలుస్తోంది. మరి ఆ ఆరోజు అల్లు అర్జున్ కనక దోషిగా తేలితే ఆయనకు ఎన్ని రోజుల శిక్ష పడబోతుందనేది కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మరి ఈ క్రమంలోనే అతని మీద కేసు పెట్టిన పోలీసులు ఆ కేసు ను విత్ డ్రా చేసుకునే అవకాశం ఏమైనా ఉందా అనే ధోరణిలో కూడా అల్లు అర్జున్ లాయర్ అయిన నిరంజన్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నట్టుగా తెలుస్తోంది. ఇక వాళ్లతో కూడా సంప్రదింపులు జరిపిన తర్వాత వాళ్లు దృఢ నిశ్చయంతో ముందుకు సాగాలని చూస్తున్నారు. విత్ డ్రా విషయంలో వాళ్ళు ఎలాంటి స్పందనను తెలియజేయడం లేదట. వాళ్ళు కేసు విత్ డ్రా చేసుకోవడం కొంతవరకు కష్టమనే విషయం అయితే స్పష్టం గా తెలుస్తోంది. మరి ఇలాంటి సందర్భంలో ఇప్పుడు తప్పు ఎవరిది అనేది తేలితే మాత్రం కోర్టులో వాళ్లకు తప్పకుండా శిక్ష అయితే పడుతుంది. మరి ఒకవేళ అల్లు అర్జున్ కనుక తప్పు చేశాడు అని తెలిస్తే మాత్రం కోర్టు అతన్ని శిక్షిస్తుందా? ఈ కేసు ఎక్కడి వరకు వెళ్లబోతుంది అనేది కూడా తెలియాల్సిన అవసరమైతే ఉంది. ఇక ఏది ఏమైనా కూడా అల్లు అర్జున్ లాంటి స్టార్ హీరో ప్రస్తుతం పుష్ప 2 సినిమాతో పెను ప్రభంజనాన్ని క్రియేట్ చేస్తున్న నేపథ్యం లో ఆయనకు ఏ మాత్రం సంతోషం లేకుండా పోతుంది. ఇక ఈ కేసు విషయం అతన్ని తీవ్రమైనగ్ర్భాంతికి గురిచేస్తుందనే చెప్పాలి. మరి దీని వల్ల ఆయన ఫ్యూచర్ లో ఎలాంటి ఇబ్బందులను ఎదుర్కోబోతున్నాడు. తన స్టార్ డమ్ కూడా తగ్గిపోబోతుందా అనేది తెలియాల్సి ఉంది. మరి ఏది ఏమైనా ఇప్పుడు అల్లు అర్జున్ కి చాలా కష్ట కాలం నడుస్తుందనే చెప్పాలి. మరి అతన్ని ఈ కేసు నుంచి ఎవరు సేవ్ చేయబోతున్నారనేది తెలియాల్సి ఉంది?

# మరో వివాదంలో మోహన్ బాబు..

హైదరాబాద్: గత కొంత కాలంగా ప్రముఖ సినీ నటుడు మోహన్ బాబు పేరు వార్తల్లో ప్రముఖంగా నిలుస్తోంది. ఆయన ఫ్యామిలీ విభేదాలు రచ్చకెక్కడం సంచలనం రేపాయి. తాజాగా మోహన్ బాబు సిబ్బంది చేసిన నిర్వాకం కారణంగా ఆయన పేరు మరోసారి వార్తల్లో నిలిచింది. జల్ పల్లిలోని మోహన్ బాబు నివాసం వెనుక ఉన్న అటవీప్రాంతంలో మేనేజర్ కిరణ్, ఎలక్ట్రీషియన్ దుర్గాప్రసాద్ అడవి పందిని వేటాడారు. వేటాడిన అడవి పందిని వారు మోసుకొస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు, అడవి పందులను వేటాడొద్దని వీరిద్దరికీ మంచు మనోజ్ పలుమార్లు చెప్పినట్టు తెలుస్తోంది. అయితే, ఆయన మాటను పట్టించుకోకుండా అడవి పందిని వారు వేటాడారు. అయితే అడవి పందిని వీరు ఎప్పుడు వేటాడారనే విషయంలో మాత్రం క్లారిటీ లేదు. వీరు అడవి పందిని వేటాడిన




సమయంలో మోహన్ బాబు ఇంట్లో లేరని తెలుస్తోంది.

# ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలి

**– ముత్తారం ఎస్ఐ గోపతి నరేష్**




ముత్తారం : పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరంకు స్వాగతం తెలుపుతూ జరుపుకునే వేడుకలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ముత్తారం ఎస్ఐ గోపతి నరేష్ మండల ప్రజలకు సూచించారు. డిసెంబర్ 31 రాత్రి నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎస్ఐ ఒక ప్రకటనలో మండల ప్రజలకు సూచనలు, హెచ్చరికలు చేశారు. మండలంలో డిజెలు, ఎక్కువ శబ్దాన్ని ఇచ్చే సౌండ్ సిస్టంను వినియోగించరాదని అన్నారు. మద్యం సేవించి రోడ్లపై ర్యాష్ డ్రైవింగ్ రాంగ్ రూట్, త్రిబుల్ డ్రైవింగ్ చేస్తూ వాహనాలు నడుపరాదని, ఎవరైనా అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాత్రి వేళ కేకలు వేస్తూ వాహనాలపై తిరగుతూ గుంపులు, గుంపులుగా చేరి నడి రోడ్డుపై కేకులు కోసి అల్లర్లు, గొడవలకు, బెదిరింపులకు పాల్పడరాదని, హద్దు మీరి ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని ప్రాంతాలలో పెట్రోలింగ్, విసబుల్ పోలిసింగ్, వాహనాల తనిఖీలు, స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ ముమ్మరంగా ఉంటాయని తెలిపారు. మద్యం సేవించి అల్లర్లకు పాల్పడడం, ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్ తీసేసి అధిక శబ్దాలతో హెరీరెత్తించడటం, బాణాస చాపేల్చడం వంటి వాటి వలన ప్రశాంతతకు భంగం కలిగి ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని, ఇలాంటి వాటికి పాల్పడితే తగిన చర్యలు తప్పవని తెలిపారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, ఈవ్ టీజింగ్ కు పాల్పడినా చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకోబడుతాయని, తల్లిదండ్రులు ఈ విషయాలను గమనించి పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచిం చారు. ఈ సందర్భంగా మండల ప్రజలకు ఎస్ఐ గోపతి నరేష్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# న్యూ ఇయర్ వేడుకలకు పోలీస్ శాఖ కీలక సూచనలు..

**– కాటారం సిఐ నాగార్జున రావు**



మల్హర్ రావు/కాటారం: కాటారం మండల ప్రజలు,యువత నూతన సంవత్సర వేడుకలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని కాటారం సిఐ నాగార్జున రావు సూచించారు.మంగళవారం నవతెలంగాణతో ఆయన మాట్లాడారు. నూతన సంవత్సర వేడుకల పేరుతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించినా.. అతిగా మద్యంతాగి గొడవలకు పాల్పడ్డ చట్ట పరంగా చర్యలు తీసుకుంటుమన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలకు పోలీస్ శాఖ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. వేడుకల్లో డీజేలు, మద్యం తాగి వాహనాలను ఓవర్ స్పీడ్గా నడపడం నిషేధమన్నారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు చర్యలు తప్పవన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో ఇతరులకు ఇబ్బంది కలుగకుండా జరుపుకుంటూ.. పోలీసులకు సహకరించాలని సూచించారు.

పోలీసుల సూచనలు..

- నూతన సంవత్స వేడుకలకు పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి..
- రోడ్లు బ్లాక్ చేసి సంబరాలు చేసుకోవద్దు..
- ఈ వేడుకల సందర్భంగా టపాసులు పేర్చొద్దు. జైలు నిషేధం..
- మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు..
- మద్యం మత్తులో వాహనాలు నడపొద్దు..
- మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించొద్దు..
- ఇతరులకు ఇబ్బంది కలిగించొద్దు..
- ఇళ్లు, ప్రైవేటు ఆస్తులపై, వీధి దీపాలపై రాళ్లు వేడయం, అద్దాలు పగులగొట్టడం చట్టరీత్యా నేరం..
- ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, త్రిబుల్ రైడింగ్ నిషేరిత డ్రగ్స్, గంజాయి వంటి దుత్తు పదార్థాలు వినియోగించినా.. విక్రయించినా కఠిన చర్యలు తప్పవు..
- మద్యం దుకాణాలు నిర్ణీత సమయంలోనే మూసివేయాలి..
- మైనర్లకు మన్యం విక్రయింకొద్దు..
- బహిరంగ ప్రవేశాలు, ప్రభుత్వ స్థలాల్లో మద్యం తాగితే కేసులు నమోదు..
- న్యూ ఇయర్ ఆఫర్ల పేరుతో సైబర్ నేరగాళ్లు ఆర్థిక నష్టం కలిగించే అవకాశం ఉంది.. ఆన్లైన్లో అపరిచితులకు వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ అకౌంట్ వివరాలు, పిన్ నంబర్లు ఇవ్వొద్దు..

# అగ్నిప్రమాదంతో గుడిసె దగ్ధం

**– నిరాశ్రయులైన గిరిజన కుటుంబాన్ని ఆదుకున్న ఉప్పల వెంకటేష్**

**– కొంత నగదుతో పాటు బియ్యం, నిత్యావసర వస్తువులు, దుస్తులు అందజేత**

**– ఇంటి నిర్మాణానికి సహకరిస్తానని హామీ**



ఆమనగల్ : కల్వకుర్తి నియోజకవర్గంలోని తర్నికల్ తాండాకు చెందిన రాత్లావత్ కమ్లి సిత్యా నాయక్ కుటుంబం నివాసముంటున్న పూరి గుడిసె ఇటీవల అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా కాలిపోయింది. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మెన్ ఉప్పల వెంకటేష్ కట్టుబట్టలతో పాటు నిత్యావసర సరుకులు, ఇతర ఇంటి సామాగ్రి మొత్తం అగ్నికి ఆహుతై నిరాశ్రయులైన కమ్లి సిత్యా నాయక్ కుటుంబానికి అండగా నిలిచారు. ఈమేరకు మంగళవారం ఉదయం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్ బాధిత కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తక్షణ సహాయంగా కొంత నగదు, 50 కిలోల బియ్యం, నూనె, మిర్చి పౌడర్, పప్పు, పంచదార, గోధుమ పిండి తదితర 20 రకాల నిత్యావసర వస్తువులతో పాటు వారికి కావలసిన దుస్తులను స్థానిక నాయకుల ద్వారా అందజేశారు. అదేవిధంగా సిత్యా నాయక్ ఇంటి నిర్మాణానికి సహకారం అందిస్తానని ఉప్పల హామీ ఇచ్చారు. అనుకోని సంఘటనతో నివాసముంటున్న గుడిసెతో పాటు నిత్యావసర వస్తువులు, బట్టలు అన్ని అగ్నికి ఆహుతై దిక్కుతోచని స్థితిలో విలపిస్తున్న గిరిజన కుటుంబానికి నేనున్నానంటూ అన్నివిధాలా ఆదుకున్న ఉప్పల వెంకటేష్ ను బాధిత కుటుంబ సభ్యులతో పాటు, తాండా వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈకార్యక్రమంలో ఉప్పల వెంకటేష్ అన్న సైన్యం, బీఆర్ఎస్వీ కల్వకుర్తి అధ్యక్షులు దారమోని గణేష్, మండల మాజీ కో–ఆప్షన్ సభ్యులు రుక్కుమ్దీన్, మాజీ సర్పంచ్ సోమ్లా నాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తాళ్ళ సురేష్ గౌడ్, దేవయ్య, గుండ్యా నాయక్, లక్ష్మణ్, శ్రీను, పాండు, రాజు, బాబులాల్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానోపాధ్యాయుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**– అయ్యప్ప మాల ముసుగులో మతకలహాలు : సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్**

**– బాధితుడికి ప్రజాసంఘాల నేతల పరామర్శ**



రంగారెడ్డి: ప్రధానోపాధ్యాయుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అయ్యప్ప స్వాముల ముసుగులో కాషాయ మూకలు మతకలహాలకు పాల్పడుతున్నాయన్నారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ప్రభుత్వ పాఠశాలలో అయ్యప్ప మాలలో ఉన్న విద్యార్థికి ప్రధానోపాధ్యాయుడు రాములు కాలు తగిలిందనే కారణంతో అతనిపై అయ్యప్ప స్వాములు దాడి చేయడాన్ని సీఐటీయూ, ప్రజాసంఘాలు ఖండించాయి. సోమవారం ప్రధానోపాధ్యాయుడు రాములును తుక్కుగూడలోని ఆయన నివాసంలో సీఐటీయూ, ప్రజాసంఘాల నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ.. ప్రధానోపాధ్యాయుడిపై లేనిపోని నిందలు వేసి, అయ్యప్ప స్వాముల ముసుగులో బీజేపీ నాయకులు దాడి చేశారన్నారు. అతని బట్టలు చించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తరువాత విద్యార్థి కాళ్లు మొక్కించారని తెలిపారు. ఈ దుర్మర్గమైన చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ కవిత, సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాంచందర్ తదితరులు ఉన్నారు.

# విద్యుత్తు రంగాన్ని కాపాడుకుందాం

**– ప్రయివేటు కరుణకు వ్యతిరేకంగా పోరాడుదాం**

**– సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్**



కంఠేశ్వర్ : విద్యుత్తు రంగాన్ని కాపాడుకుందాం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం అని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగా ప్రైవేటీకరణకు నిరసనగా విద్యుత్ రంగా కార్మికులకు సంఘీభావంగా సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంఘీభావం తెలియజేశారు. ఈ నిరసన కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు మద్దతు తెలిపారు అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. కేంద్రంలో మూడవసారి ఏర్పడిన మోడీ ప్రభుత్వం గతంలో కన్నా మరింత దూకుడుగా ప్రజా వ్యతిరేక, వినాశకర విధానాలను అవలంబిస్తున్నది. విద్యుత్ రంగంపై బిజెపి ప్రభుత్వం చేస్తున్న దాడి ఇందుకు ప్రబల తార్కాణం. ఈ కాలంలోనే చండీగఢ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో డిస్కంలను ప్రైవేటీకరించే ప్రయత్నాలు మొదలయ్యాయి.దాదాపు అన్ని రాష్ట్రాలలో స్మార్ట్ మీటర్లు నెలకొల్పడం ద్వారా దొడ్డి దారిన ప్రైవేటీకరించే ప్రయత్నాలు ఊపందు కున్నాయి. పవర్ గ్రిడ్ సబ్స్టేషన్లను గంపగుత్తగా ఔట్సోర్స్ చెయ్యమని ఆదేశాలు జారీ అయ్యాయి. పునరుత్పత్తి ఇంధన సరఫరా కాంట్రాక్టులు చేజిక్కించుకుని, అధిక ధరలకు విద్యుత్ అమ్మజూపుతున్న అదానీపై లంచాలు ఇచ్చి మరీ ఈ కాంట్రాక్టులు దక్కించుకున్నాడన్న ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి.

అయినప్పటికీ స్మార్ట్ మీటర్ల అమలు సహా అన్ని కాంట్రాక్టులూ అదానీకే కట్టబెట్టారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించడానికి మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యుత్ రంగ కార్మికులు వీరోచితమైన పోరాటం చేస్తున్నారు. నేడు చండీగఢ్ విద్యుత్ కార్మికులు, ఉత్తర ప్రదేశ్ విద్యుత్ రంగ కార్మికులు ఈ పోరాటంలో అగ్రభాగాన ఉన్నారు. 2003 విద్యుత్ చట్టానికి బలవంతంగా మార్పులు చెయ్యడానికి ప్రయత్నించి నపుడు కూడా చండీగఢ్ విద్యుత్ రంగ కార్మికులు సమరశీలంగా పోరాడారు. ఆ వారసత్వాన్నే నేటికీ కొనసాగిస్తున్నారు. చండీగఢ్ విద్యుత్ రంగం 2019–20, 2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరాల్లో వరుసగా 365, 225, 261 కోట్ల రూపాయల లాభాలు సంపాదించిన ప్రభుత్వ రంగ సంస్థగా గుర్తింపు పొందింది. విద్యుత్ లైన్ సరఫరా నష్టాలు జాతీయ స్థాయిలో 15 శాతంపై మాటే కానీ చండీగఢ్ విద్యుత్ రంగం ఈ నష్టాన్ని 10 శాతం లోపుగా ఉండేలా సాధించింది. ఎ అన్ని విధాలా అత్యుత్తమ సామర్థ్యం కలిగిన చండీగఢ్ విద్యుత్ సంస్థను కారు చౌకగా రూ. 174.63 కోట్లకు వేలం పాట పెట్టారు. సంస్థ భూములను, ఆస్తులను నెలకు ఒక్క రూపాయి అద్దెగా చెల్లించి వాడుకోవడానికి అనుమతి ఇస్తున్నారు.కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్ (కాగ్) ద్వారా సంస్థ స్థిర, చరాస్తుల విలువను మదింపు చెయ్యాలని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ కో–ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్ సంఘాలు సంయుక్తంగా డిమాండ్ చేస్తున్నాయి. అలాగే టెండర్ ధరను నిర్ణయించడానికి ప్రాతిపదికగా తీసుకున్న ఆర్థిక సమాచారం మొత్తాన్ని మదింపు చెయ్యాలని కోరాయి.కానీ కేంద్రపాలిత ప్రాంత అధికార యంత్రాంగం ఈ డిమాండ్లను పరిశీలించ కుండా హడావుడిగా ఎమినెంట్ ఎలక్ట్రిసిటీ లిమిటెడ్ (ఇ.ఇ.డి.యల్) అనే ప్రైవేటు కంపెనీకి ఆసక్తి వ్యక్తీకరణ పత్రాలు (లెటర్ ఆఫ్ ఇంటెంట్– ఎల్.ఒ. ఐ) జారీ చేసింది. విచిత్రం ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగం ప్రవేటీకరణ ను ఆపకుంటే పోరాటాలను ఉధృతం చేస్తాం ఈ కార్యక్రమంలో నాయక్ వాడి శ్రీనివాస్ సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కటారి రాములు, ఆటో నాయకులు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విగ్నేష్, దినేష్, ఆజాద్, పద్మ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# వాయిదాపడ్డ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం శిక్షణా తరగతులు..



కంఠేశ్వర్ : తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం తలపెట్టిన శిక్షణ తరగతులను వాయిదా పడ్డాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ద వెంకట రాములు తెలిపారు. ఈ మేరకు మంగళవారం జరిగిన జిల్లా అత్యవసర జిల్లా కమిటీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకున్నామన్నారు. జనవరి 2025 లో 4, 5, 6 తారీకులలో జరప తలపెట్టిన రాజకీయ సామాజిక శిక్షణా తరగతులు వ్యవసాయ పనులు ఇంకా పూర్తికానందన అనివార్యంగా వాయిదా వేయాల్సి వస్తున్నదని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్ రాములు ప్రకటించారు. తిరిగి 2025 జనవరి 20, 21, 22 తేదీలలో జరుగుతాయి. అలాగే ఈ మధ్యకాలంలో ప్రభుత్వం తీసుకున్న 6 గ్యారెంటీలు అమలు కోసం మండల స్థాయిలో పోరాటాలు చేయాలని పిలుపునిస్తున్నాం. కాబట్టి దీన్ని శ్రేయోభిలాషులు, కార్యకర్తలు, నాయకులు, వ్యవసాయ కార్మికులు పరిగణలోకి తీసుకోవాలని రాజకీయ శిక్షణ తరగతులు జయప్రదానికై తోడ్పడాలని కోరుతున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు బొర్ర సత్యనారాయణ, ఉపాధ్యక్షులు గోళం లక్ష్మి, సహాయ కార్యదర్శి గోవర్ధన్, సభ్యులు చంద్రకాంత్, పిండి రాజేశ్వరి, లక్ష్మీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైద్య బీమా కంపెనీల దోపిడీ

**– 29 శాతం క్లెయిమ్స్ తిరస్కరణ**

**– 71 శాతం కేసుల పరిష్కారం**

**– పాలసీదారులపై రూ. 16,000 కోట్ల భారం**


**– అంబూడ్స్‌మెన్‌కు 34వేల ఫిర్యాదులు : ఐఆర్‌డీఏఐ రిపోర్ట్**




దేశంలోని పలు వైద్య బీమా కంపెనీలు పాలసీదారుల క్లెయిమ్‌లను పరిష్కరించకుండా.. ఓ విధంగా దోపిడీకి పాల్పడుతున్నాయి. బీమా ఇచ్చే సమయంలో క్యాష్‌లెస్, మొత్తం మేమే భరిస్తామని చెప్పుతూ పాలసీలు చేయిస్తున్న సంస్థలు.. ఆ తర్వాత పాలసీదారు అనారోగ్యంతో హాస్పిటల్ పాలు అయితే చెల్లింపుల్లో కొసర్లు, కోతలు పెట్టడమే కాదు.. కొన్ని సార్లు పూర్తిగా తిరస్కరిస్తున్న ఘటనలు అమాంతం పెరిగాయి. ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) రిపోర్ట్ ప్రకారం.. గడిచిన ఆర్థిక సంవత్సరం 2023–24లో విలువ పరంగా 29 శాతం క్లెయింలు తిరస్కరణకు గురైయ్యాయి. దీంతో పాలసీదారులపై రూ.16,000 కోట్ల పైగా భారం పడింది. తాము చేసుకున్న బీమా తిరస్కరణకు గురి కావడంతో ఈ మొత్తాన్ని వారు తమ జేబు నుంచి భరించాల్సి వచ్చింది. దీంతో తమకు హామీకి తగ్గట్లుగా సేవలు అందలేదని అంబూడ్స్‌మెన్‌కు 34,000కు పైగా ఫిర్యాదులు అందాయి. అంటే బీమా కంపెనీల పనితీరు స్పష్టమవుతోంది. దేశంలోని ఆరోగ్య బీమా సంస్థలు మొత్తం ఫైల్ అయిన క్లెయిమ్‌లలో 71.3 శాతం విలువైన క్లెయిమ్‌లను మాత్రమే పరిష్కరించాయి. 2023–24లో దాదాపు రూ.1.2 లక్షల కోట్ల విలువైన క్లెయిమ్‌లు ఫైల్ అయ్యాయి. వాటిలో రూ.1.1 లక్షల కోట్ల విలువైన 3 కోట్ల కొత్త క్లెయిమ్‌లు, అంతక్రితం సంవత్సరాలకు సంబంధించిన రూ.6,290 కోట్ల క్లెయిమ్‌లు ఉన్నాయి. మొత్తం క్లెయిమ్‌లలో రూ.83,493 కోట్ల విలువైన 2.7 కోట్ల క్లెయిమ్‌లను బీమా సంస్థలు పరిష్కరించాయి. సంఖ్యా పరంగా 82 శాతం క్లెయిమ్‌లు పరిష్కరించగా, విలువ పరంగా 71.3 శాతం చెల్లింపులు జరిగాయి. ఇందులో తమ షరతులకు అనుగుణంగా లేవని రూ.15,100 కోట్ల విలువ చేసే వైద్య బీమా క్లెయిమ్‌లను నిరాకరించాయి. అదనంగా రూ.1,093 కోట్ల విలువైన 3.6 లక్షల పాలసీలు తిరస్కరించబడ్డాయి.

# మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి..

**– జిల్లా కలెక్టర్ హనుమంతరావు**



భువనగిరి కలెక్టరేట్ :మెనూ ప్రకారం,నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ విద్యార్థులకు పౌష్టిక ఆహరం అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం రోజు భువనగిరి మండల కేంద్రంలోని రాయగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను కలెక్టర్ సందర్శించి, మధ్యాహ్న భోజన పథకంలో బాగంగా కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనంలో నూతన మెనూ ప్రకారం నాణ్యత ప్రమాణాలతో పాటిస్తూ విద్యార్థులకు రుచి కరమైన వంట చేయడం జరిగిందని తెలిపారు.నాణ్యమైన వంట చేసిన ఏజెన్సీ సభ్యురాలు కవితను కలెక్టర్ శాలువాతో సన్మానించారు. ప్రతి రోజూ ఇదేవిధంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏజెన్సీ సభ్యురాలను కోరారు.. మధ్యాహ్న భోజన పథకం కింద వంట చేస్తున్న ఏజెన్సీకి నిధులు త్వరలో మంజూరు చేయించడం జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యను ఎలా బోధిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ మీరు ఎలా చదువుతున్నారని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి దశ చాలా కీలకమైందని ఈ దశలో చదువు మీద ప్రత్యేక దృష్టి పెడితేనే భవిష్యత్ బాగుతుందని విద్యార్థులకు హితబోధ చేశారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు జి. పి. ఏలో 10/10 సాధిస్తే ఎమ్మెల్యే తో విద్యార్థుల తల్లి దండ్రులకు సన్మానం చేస్తూ, వారి సమక్షంలో సైకిళు బహుమతిగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. పదవ తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. జిల్లాను ప్రథమ స్థానంలో ఉండే విధంగా కృషి చేయాలన్నారు.మంచిగా చదువుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందని, ఉన్నత స్థానాలను చేరుకోవచ్చన్నారు.

# ఫిబ్రవరి 25న హైదరాబాద్‌లో చేనేత గర్జన

**- కార్మికుల ఉద్యమానికి సీపీఐ(ఎం) పూర్తి మద్దతు : పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు**

**- సమస్యలపై జనవరి 20న జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నా: తెలంగాణ చేనేత కార్మిక సంఘం రౌండ్‌టేబుల్ నిర్ణయం**

**- హాజరైన పలు పార్టీలు, వివిధ చేనేత కార్మిక సంఘాల నేతలు**

**- చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవద్దు**

**- చనిపోయిన కార్మికుల కుటుంబాలను ఆదుకుంటాం: ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**



ముషీరాబాద్: చేనేత కార్మికుల సమస్యలపై వచ్చే ఏడాది జనవరి 20న జిల్లాల కలెక్టరేట్ల ముందు ధర్నా, ఫిబ్రవరి 25న హైదరాబాద్‌లో చేనేత గర్జన నిర్వహించాలని తెలంగాణ చేనేత కార్మికసంఘం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్‌లో నిర్ణయించారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ చేనేతకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతికుమార్ అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్‌కు పలు రాజకీయ పార్టీలు, వివిధ చేనేత కార్మిక సంఘాల నేతలు హాజరయ్యారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యే చింతాప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎల్. రమణ మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ చేనేత కార్మిక సంఘం ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పాటు చేయాలని, హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభ పెద్ద ఎత్తున జరగాలని, ఆ సభలో, ఇటీవల ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటామన్నారు. తమ ప్రభుత్వంలో ఇచ్చిన పథకాలు ఈ ప్రభుత్వంలోనూ కొన సాగించే విధంగా కార్మికసంఘాలు పోరాటం చేస్తే తాను ముందుంటానని అన్నారు. చేనేత కార్మికులు ఎలాంటి ఆత్మహత్యలూ చేసుకోవద్దని, ప్రభుత్వం మెడలు వంచైనా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. చనిపోయిన కుటుంబాలకు తమవంతు ఆర్థికసాయం చేస్తామని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హామీ ఇచ్చారు. సమస్యలపై ఉద్యమించిన వారికి మద్దతు పూర్తిగా ఉంటుందని అన్నారు. చేనేత పథకాలు అమలయ్యే వరకు, ప్రభుత్వం మెడలు వంచే దాకా పోరాడాలని పిలుపునిచ్చారు.

చేనేత కార్మికులకు సీపీఐ(ఎం) మద్దతు : చెరుపల్లి

చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని, చేనేత కార్మికుల ఉద్యమానికి సీపీఐ(ఎం) పూర్తి మద్దతు ఉంటుందని పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు తెలిపారు. కార్మికుల డిమాండ్లపై చేనేత కార్మిక సంఘం అనేక విధాలుగా పోరాటం చేస్తున్నద న్నారు. కార్మికులకు 50 సంవత్సరాలకే పింఛన్ వచ్చే విధంగా పోరాడారని తెలిపారు. ఏ ప్రభుత్వం వచ్చినా చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించక తప్పదన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను యధావిధిగా ఈ ప్రభుత్వం కూడా అమలు చేసే విధంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. చేనేత కార్మికుల సమస్యలపై మీరు ఏ ఉద్యమం చేసినా సీపీఐ(ఎం) తరఫున పూర్తి మద్దతు ఉంటుందన్నారు. ముందుండి కార్మికుల సమస్యల పరిష్కారానికి కషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్మికులు ఆత్మహత్యలకు పూనుకోవద్దని ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తూ పోరాడి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్య సలహాదారు కూరపాటి రమేష్ మాట్లా డుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి చేనేత సమస్యలు పరిష్కారం కాలేదని, కావున పోరాటం చేయాలన్నారు. జనవరి చివరి వారంలో శాసనసభ, శాసనమండలి సభ్యులకు, వినతి పత్రాలు అందించాలని, బడ్జెట్ సమావేశాల సంద ర్భంగా ఫిబ్రవరి 20న హైదరాబాద్‌లో వేలాది మందితో చేనేత గర్జన నిర్వహించాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ నరసింహారెడ్డి, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గంజి మురళీధర్, సహాయ కార్యదర్శి ముషం నరహరి, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ , ఆప్కో మాజీ డైరెక్టర్ వీరన్న, చిక్క దేవదాస్, జమ్మికుంట సంఘం అధ్యక్షులు పెండెం సర్వేషం,నల్గొండ జిల్లా చేనేత అధ్యక్షులు కందగట్ల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఆశాలకు రూ.18వేల వేతనం ఇచ్చే వరకు పోరాటం

**- తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి**

**- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు చేరుకున్న ఆశాల బస్సు జాతా**



సిటీబ్యూరో: ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంతో ఆహర్నిశలూ కృషి చేస్తున్న ఆశా కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు నిర్ణయించి అమలు చేసే దాకా పోరాటం ఆగదని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి అన్నారు. ఆశా వర్కర్ల రాష్ట్ర బస్సు జాతా సోమవారం రంగారెడ్డి జిల్లా తుక్కుగూడకు వచ్చింది. అదే విధంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కేంద్రానికి చేరుకున్నది. బృందం సభ్యులకు సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎ.అశోక్, చంద్రశేఖర్, ఆశావర్కర్లు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమలానగర్ సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో పి.జయలక్ష్మి మాట్లాడుతూ.. టార్గెట్లు పెట్టి పని చేయించడం, పనికి తగ్గ పారితోషికం అంటూ ఆశా కార్యకర్తలను వేధించడం, శ్రమదోపిడీకి గురిచేయడం మానుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాదీ ఆరోగ్యంపై పెట్టే బడ్జెట్‌ను తగ్గిస్తూ పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యాన్ని కార్పొరేట్‌మయం చేస్తూ బడా పారిశ్రామికవేత్తల సేవలో ప్రధాని మునిగి తేలుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఆశాలకు కనీస వేతనం రూ.18 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశాల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, గతంలో ఆశాల సమ్మె, చలో హైదరాబాద్ కార్యక్రమాల సందర్భంగా అధికారులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం, పండుగలకు సెలవులను తక్షణమే అమలు చేయాలని కోరారు. అనంతరం జె.చంద్రశేఖర్, ఎ.అశోక్ మాట్లాడారు. ఈ సభలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షులు ఎ.హేమలత, కార్యదర్శి ఎం.రేవతికల్యాణి, జిల్లా ఆఫీస్ బేరర్స్ కోమలత, రాధ, జయప్రద, వాసంతి, బస్సు జాతా బృంద సభ్యులు ఆర్.సాధన, ఎన్.పద్మ, బాలమణి, సీఐటీయూ నాయకులు ఎన్.శ్రీనివాస్, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

# సమ సమాజ స్థాపనకు పోరాడాలి

**- సీపీఐ(ఎం) హైదరాబాద్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి**

**- హైదరాబాద్‌లో రక్తదాన శిబిరం**



ముషీరాబాద్: సమ సమాజ స్థాపన కోసం పోరాడాలని సీపీఐ (ఎం) హైదరాబాద్ నగర కార్యదర్శి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి అన్నారు. ఎస్ఎఫ్ఐ 55 ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుంద రయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్వాతంత్రం, ప్రజా స్వామ్యం, సోషలిజం అనే నినాదంతో ఉన్న జెండాను ఆర్ఎల్. మూర్తి ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థి అమరవీ రులను స్మరించుకుంటూ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎం.శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫల మైందన్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరమైనా ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, విద్యారంగానికి అధిక నిధులు కేటాయిం చాలని, ప్రభుత్వ విద్యాసంస్థలను అభివృద్ధి చేయాలని కోరారు. లేదంటే ప్రభుత్వాలను రానున్న ఎన్నికలలో విద్యార్థులే గద్దె దింపుతారని హెచ్చరిం చారు. విద్యార్థి అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకుపోతా మన్నారు. ఆర్ఎల్ మూర్తి. మాట్లాడుతూ.. 1970లో డిసెంబర్ నెలలో కేరళలోని త్రివేండ్రంలో ఎస్ఎఫ్ఐ ఏర్పడిందని గుర్తు చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎన్నో పోరాటాలు చేస్తూ.. విజయాలు సాధిస్తూ దేశంలో అతిపెద్ద విద్యార్థి సంఘంగా అవతరించిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. ప్రయివేటు, కార్పొరేటు విద్యాసంస్థలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని దెబ్బతీసే కుట్ర చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎండీ జావేద్, ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లెనిన్, అశోక్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు స్టాలిన్, శ్రీమన్, నాగేందర్, ప్రశాంత్ చరణ్‌శ్రీ, నాయకులు విగేష్, రాజేష్, రజినీకాంత్, సహనా తదితరులు పాల్గొన్నారు.ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. సంఘం నాయకులు జెండాలు ఆవిష్కరించారు. వికారా బాద్ పట్టణ కేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షులు అక్బర్ జెండా ఆవిష్కరిం చారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో సంఘం జిల్లా కేవై ప్రణరు ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ, వేములపల్లి, దేవరకొండలో ఎస్ఎఫ్ఐ జెండాలను ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఆముదాల రంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో చేర్యాల పట్టణ కేంద్రంలో జెండాను ఆవిష్కరించారు. అదేవిధంగా ఎస్ఎఫ్ఐ సిద్దిపేట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్యం, ప్రజాస్వా మ్యం, సోషలిజం అనే నినాదంతో ఉన్న జెండాను జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ ఆవిష్కరించారు.

# తెలంగాణలో డ్రగ్స్ అమ్మాలన్నా కొనాలన్నా భయపడేలా

**- పట్టుబడితే శిక్ష తప్పదనేలా చర్యలు తీసుకుంటున్నాం**

**- డ్రగ్స్ రహితంగా మత్తుమందు దొరకని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నాం**

**- డీజీపీ జితేందర్**

హైదరాబాద్: ఈ ఏడాది మొత్తం 1,942 డ్రగ్స్ కేసుల్లో 4,682 మందిని అరెస్టు చేశామని, 142.95 కోట్ల విలువైన మత్తు పదార్థాలను సీజ్ చేశామని గుర్తుచేశారు. ఈ కేసుల్లో నిందితులకు చెందిన 55.8 కోట్ల ఆస్తులను స్వాధీనం చేసు కున్నామన్నారు. ఆదివారం ఆయన రాష్ట్ర వార్షిక నేర నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ. మావోయిస్టుల కట్టడికి, సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సైబర్ నేరాల్లో డబ్బు పోగొట్టుకున్న వారికి 180 కోట్ల మేర తిరిగి ఇప్పించాం. ఈ ఏడాది సైబర్ నేరాలకు సంబంధించి 25,184 ఫిర్యాదులు వచ్చాయి. గత ఏడాది 17,571 ఫిర్యాదులు, తో పోలిస్తే సైబర్ నేరాల్లో 25.18 పెరుగుదల ఉంది. సైబర్ నేరాల్లో రికవరీకి సంబంధించి దేశంలోనే తెలంగాణ టాప్‌లో ఉంది అని వ్యాఖ్యానించారు. మొత్తమ్మీద ఈ ఏడాది నేరాల్లో 9.87 పెరుగుదల ఉందన్నారు. గత ఏడాది మొత్తం 2,13,121 కేసులు నమోదు కాగా,ఈ ఏడాది వాటి సంఖ్య 2,34,158గా ఉంది.వీటిల్లో 1,55,639 కేసులను నవంబరు నెలాఖరు లోగా పరిష్కరించాం. ప్రాసిక్యూషన్, పోలీసు శాఖ కలిసి పనిచేయడం వల్ల చాలా కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చేయడం సాధ్యమైంది. వీటిల్లో మూడు మరణ శిక్షలు, 215 జీవిత ఖైదు శిక్షలున్నాయి శిక్షలు పడ్డ వారిలో 35 మంది రౌడీషీటర్లున్నారు అని వివరించారు.

# సచివాలయ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలి.

**సమయపాలన పాటించని వారిపై కఠిన చర్యలు కమిషనర్ ఎన్.మౌర్య**

సచివాలయ కార్యదర్శులు, నగరపాలక సంస్థ అధికారులు అందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఖచ్చితంగా సమయపాలన పాటించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను, కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం ఉదయం నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని సచివాలయాల కార్యదర్శుల హాజరు నమోదును పరిశీలించి, అందుబాటులో లేని వారిపై చర్యలకు ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సచివాలయం సిబ్బంది, కార్యాలయ అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించాలని, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుంటూ నగర అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ప్రతి సచివాలయం వద్ద కార్యదర్శులు తప్పనిసరిగా అందుబాటులో ఉండి, ప్రజల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర,, మేనేజర్ హాసిమ్, ఏసిపి బాలాజి, డి.ఈలు, సూపరింటెండెంట్లు, తదితరులు ఉన్నారు..

# ప్రతి ఫిర్యాదు పై వేగంగా స్పందించి బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా కృషి చేయాలి

**- వార్షిక తనిఖీల్లో జగిత్యాల పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

జగిత్యాల: పోలీస్ స్టేషన్ కు ప్రతి ఫిర్యాదు పై వేగంగా స్పందించి బాధితులకు తక్షణమే న్యాయం చేసే విధంగా విధి నిర్వహణ ఉండాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు.సోమవారం వార్షిక తనిఖీ లో భాగంగా జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. ప్రజా సమస్యల పైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా బరోసా కల్పించాలని, బాధితులకు ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీస్ స్టేషన్ ని సంప్రదించవచ్చుని అన్నారు. పోలీస్ స్టేషన్ లో పెట్రోల్ కార్, బ్లూ కోట్ సిబ్బంది సమర్ధవంతంగా విధులు నిర్వహిస్తున్నారని సంఘటన స్థలానికి నిమిషాల్లో చేరుకునే విధంగా పని చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పెండింగ్ లో ఉన్న కేసుల గురించి,పెండింగ్ ఉన్న కేసులపై రివ్యూ చేయడం జరిగింది. పోలీస్ స్టేషన్ ల పరిధిలోని కేసుల నమోదు, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించిన వివరాలని అడిగి తెలుసుకున్నారు.అనంతరం పోలీస్ స్టేషన్ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వారి యొక్క డ్యూటీ ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రిసెప్షన్ వర్టికల్ నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు ను పిటిషన్ మేనేజ్మెంట్లో ఎంట్రీ చేసిన డాటా ను తనిఖీ చేశారు. రిసెప్షనిస్ట్ గా ప్రతి దరఖాస్తు పై తప్పనిసరిగా పిటిషన్ మేనేజ్మెంట్ లో జనరేట్ చేసినా రిసిప్ట్ ఇవ్వాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో 5ఎస్ విధానాన్ని పాటిస్తూ పరిశుభ్రంగా ఉండేటట్లు అదేవిధంగా ఫైల్స్, క్రమపద్ధతిలో నిర్దేశిత ప్రదేశాల్లో ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు.రికార్డ్ రూమ్, రైటర్ రూమ్ తదితర అన్ని విభాగాలు తిరిగి క్షుణ్ణంగా పరిశీలించారు. సైబర్ నేరాల బారిన పడకుండా పరిధి పోలీస్ స్టేషన్ పరిధిలో అవగాహన పెంచాలన్నారు.తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలన ఆక్సిడెంట్ జోన్ లుగా, బ్లాక్ స్పాట్స్ గా గుర్తించి,రోడ్డు ప్రమాదాల నివారణకై చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉంటూ విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని సూచించారు.పోలీస్ శాఖ నూతన టెక్నాలజీ అధునాతన టెక్నాలజీ ఉపయోగిస్తున్న దానిగురించి అధికారులకు సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. సిబ్బంది కి ఏమైనా సమస్య లు ఉన్నాయా అని, ఏమైనా ఉంటే తమ దృష్టి కి తీసుకొని రావాలని సూచించారు.ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పోలీస్ స్టేషన్ కి అనుసంధానం చేసే విధంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంను ఎస్పీ ప్రారంభించారు,పోలీస్ స్టేషన్ ఆవరణ లో ఎస్పీ మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ రఘు చందర్, టౌన్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సైలు కిరణ్ కుమార్, మన్మధరావు, గీత, మల్లేశం,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సింగిల్ యూజ్ కారీ బ్యాగులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం..


**- తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబెర్ సెక్రటరీ రవి గుగులోతు.**

హైదరాబాద్: నిబంధనలకు విరుద్ధంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు సమాజంలో పెద్ద ఎత్తున వస్తూ వ్యవస్థను తీవ్రమైన ఇబ్బందులకు, నష్టానికి గురి చేస్తున్నాయని, వాటిని నియంత్రించే చర్యలు చేపట్టాలని "ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్సీ హెచ్ రంగయ్య సోమవారం తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్య కార్యదర్శి రవి గుగులోతు ను కలిసి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో స్థానికంగా నిర్వహించే వారాంతపు సంతల్లో ఈ ప్లాస్టిక్ వినిమయం భయపెడుతోందని, అంతేగాక అనేకమంది చిరువ్యాపారులు పెద్దస్థాయిలో వీటి వాడకాన్ని కొనసాగిస్తున్నారని వివరించారు. అంతేగాక సరైన నిర్వహణ లేక గ్రామాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కొండల్లా పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోందని, పలు చోట్ల దహనం జరుగుతున్న వైనం మా సంస్థ గుర్తించిందని కార్యదర్శి దృష్టికి తీసుకుపోయారు. తక్షణమే చర్యలు చేపట్టకపోతే అనేక సమస్యలు ఎదురయ్యే పరిస్థితి ఉందని తెలిపారు. సానుకూలంగా స్పందించిన పొల్యూషన్ బోర్డు కార్యదర్శి ... సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పై త్వరలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా. ..కౌన్సిల్ ముద్రణ చేస్తున్న " ఎన్విరాన్మెంట్ యాక్టివిస్ట్ " మాసపత్రిక సంచికను అందజేశారు.

# ధరల నియంత్రణలో కేంద్రం విఫలం

**- మహిళలపై లైంగికదాడులు, హింసను అరికట్టాలి**

**- ఇందిరమ్మ ఇండ్లలో ఒంటరి మహిళలకు అవకాశం కల్పించాలి : ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి**



సిద్దిపేట అర్బన్: నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వంగా విఫలమైందని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. దేశంలో మహిళలపై రోజురోజుకూ పెరుగుతున్న హింస, దాడులను అరికట్టడంలోనూ వైఫల్యం చెందిందని అన్నారు. సిద్దిపేటలో సోమవారం ఐద్వా జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి నవీన అధ్యక్షతన నిర్వహించిన జిల్లా వర్క్‌షాప్‌లో మల్లు లక్ష్మి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకొచ్చాక 11 ఏండ్ల కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంతో పోలిస్తే 100% ధరలు పెరిగాయన్నారు. దేశంలో నిత్యం హత్యలు, లైంగికదాడులు, బాలికలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని అదుపు చేయడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శిం చారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అమలవుతున్న ఉచిత బస్సు సౌకర్యంతో మహిళలకు కొంత ఉపశమనం ఉన్నప్పటికీ జనాభాకనుగుణంగా బస్సులు లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రతి నెలా మహిళలకు ఇస్తామన్న రూ.2500 ఊసే ఎత్తడం లేదని, వెంటనే అమలు చేయాలని కోరారు. గ్యాస్ సబ్సిడీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు సౌకర్యాన్ని ప్రతి పేద మహిళలకూ కల్పించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లల్లో ఒంటరి మహిళలకు అవకాశం కల్పించాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశాలత మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మహిళ వ్యతిరేక విధానాలపై, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం రానున్న కాలంలో సర్వేలు, పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి అత్తిని శారద, ఉపాధ్యక్షులు మంజులత, సహాయ కార్యదర్శులు జాలిగపు శిరీష, ఇప్పకాయల శోభ, నాయకులు సంద బోయిన రాణి, దండు లక్ష్మి, జ్యోతి, లక్ష్మి, శోభ, నరసవ్వ, మల్లవ్వ, విగేశ్వరి, లావణ్య, వరలక్ష్మి, చంద్రకళ పాల్గొన్నారు.

# పోలీస్ శాఖలో ఏం జరుగుతోంది

## ఆత్మహత్యలు, బెదిరింపులు, ఆందోళనలు

హైదరాబాద్: తెలంగాణ పోలీస్ శాఖలో వరుస ఆత్మహత్యలు కలకలం రేపుతున్నాయి. కానిస్టేబుల్, ఎస్సై స్థాయి ఉద్యోగులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. పని ఒత్తిడి, వ్యక్తిగత కారణాలు, ఉన్నతాధికారుల వేధింపులు... కారణాలు ఏవైనా కింది స్థాయి ఉద్యోగుల బలైపోతున్నారు. ఇటీవల కామారెడ్డి జిల్లాలో ఎస్, మహిళా కానిస్టేబుల్, కంప్యూటర్ ఆపరేటర్ మూకుమ్మడి ఆత్మహత్యలు తీవ్ర సంచలనం అయ్యాయి. శాంతి భద్రతలు, ప్రజల రక్షణలో ముందుండే పోలీసులు గుండె చెదిరి నిలువునా ఉసురు తీసుకుంటున్న ఉదంతాలు చోటు చేసుకుంటున్నాయి. వరుస ఆత్మహత్యలు పోలీస్ వర్గాల్లో గుబులు పుట్టిస్తున్నాయి. భద్రాద్రి కొత్త గూడెం జిల్లాలో ఇటీవల ఓ ఎస్సైతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కామారెడ్డి జిల్లాలో ఎస్ఐ, మహిళా కానిస్టేబుల్, కంప్యూటర్ ఆపరేటర్ మూకుమ్మడి ఆత్మహత్యల ఘటనపై పోలీస్ శాఖ సీరియస్ అయ్యింది. ఈ వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. ఎస్ఐ, కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చే వరకు...ఉన్నతాదికారులు ఏం చేస్తున్నారని, వారి మధ్య ఉన్న సంబంధాలపై పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతున్నా... ఎందుకు నిఘా పెట్టలేకపో యారని నిలదీసినట్లు తెలిసింది. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఎస్పీ సింధూశర్మను రాష్ట్ర పోలీసుశాఖ ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ కేసు విచారణకు ఎస్పీ మూడు టీమ్ లను ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ కేసు విచారణకు కాల్‌డేటా, వాట్సాప్ చాటింగ్, సీసీ పుటేజీ, పోస్టుమార్టం రిపోర్టులు కీలకం కానున్నాయని పోలీస్ వర్గాలు చెబుతున్నాయి. బిక్కనూరు ఎస్సై సాయి కుమార్, బీబీపేట పోలీస్ స్టేషన్ లో పనిచేస్తోన్న కానిస్టేబుల్ శ్రుతి, బీబీపేట సహకార సంఘంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న నిఖిల్ అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువులో వీరి మృతదేహాలు గుర్తించారు. ఒడ్డున వారి వస్తువులు కనిపించడంతో పోలీసులు చెరువులో గాలింపు చేపట్టగా.. శ్రుతి, నిఖిల్, సాయి కుమార్ మృతదేహాలను లభ్యమయ్యాయి. మూకుమ్మడి సూసైడ్ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం అయ్యింది. వరుస ఆత్మహత్యల నేపథ్యంలో పోలీసులకు వ్యక్తిత్వ వికాస నిపుణులచే అవగాహన సదస్సులు పెట్టించాలని పోలీస్ శాఖలో కొందరు సూచిస్తు న్నారు. పని ఒత్తిడి, ఆఫీసర్లు, సిబ్బంది మధ్య కో ఆర్డినేషన్, ఆర్థిక ఇబ్బందులు, పర్యవేక్షణపై పర్సనాలిటీ డెవలప్మెంట్ పై పలు సూచనలు ఇవాలని కోరుతున్నారు. ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావని, సమస్యలుంటే పై స్థాయి అధికారుల దృష్టికి తీసుకె ళ్లాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు ధైర్యం ఇచ్చే పోలీసులు... సమస్యలను ఎదుర్కొనే ధైర్యం కోల్పోవడం వాస్తవ పరిస్థితు లకు అద్దం పడుతున్నాయని నిపుణులు అభిప్రాయ పడుతు న్నారు. ఇటీవల టీజీఎస్పీ పోలీసుల ఆందోళనలు చేశారు. సెలవుల విషయంలో ప్రభుత్వం తెచ్చిన సర్కులర్ పోలీసుల ఆగ్రహానికి కారణమైంది. ఏక్ పోలీస్ విధానాన్ని అమలు చేయాలని పోలీసులు రోడ్డెక్కారు. స్పెషల్ పోలీస్ బృందాల్లో క్షేత్రస్థాయి పనిచేసే వారి సంఖ్యను పెంచా లని, వారికి సెలవుల విధానాన్ని పునర్వ్యవస్థీకరించాలని ఈ ఏడాది అక్టోబర్ 10న ప్రభుత్వం ఓ సర్క్యులర్ జారీ చేసింది. గతంలో ఉన్న 15 రోజు లకు నాలుగు రోజుల సెలవు విధానానికి బదులుగా ఒక నెలలో వరుసగా 26 రోజులు డ్యూటీలు చేయాల్సి ఉంటుందని సర్క్యు లర్ లో పేర్కొన్నారు. అవసరమైతే అదనంగా మరికొన్ని రోజులు కూడా విధులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సర్క్యులర్‌ను వ్యతిరేకిస్తూ టీజీఎస్పీ సిబ్బంది ఆందోళన చేశారు. చివరకు ప్రభుత్వం ఈ సర్క్యులర్‌ను వెనక్కి తీసుకుంది. పని ఒత్తిడి, పనిప్రదేశాల్లో వేధింపులు, వ్యక్తిగత సంబంధాలు.. ఆత్మహత్యలకు దారితీస్తున్నాయని ఇటీవల ఘటనలతో నిర్ధారణ అవుతోంది. పోలీసులపై ఒత్తిడి తగ్గించేందుకు శాఖపరమైన అవగాహన కార్యక్రమాలు, నిపుణుల మోటివేషనల్ ప్రోగ్రామ్స్ తరచుగా ఏర్పాటు చేయాలన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

# కరీంనగర్ జిల్లాకు పర్యాటక ఊపు

కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పర్యాటక రంగం పరిఢవిల్లుతోంది. ఆధ్యాత్మిక క్షేత్రాలకు రాష్ట్రం నలుమూలల నుంచి సందర్శకుల తాకిడి పెరుగుతోంది. ప్రజా రవాణా వ్యవస్థతోపాటు వ్యక్తిగత రవాణా వాహనాల సౌకర్యం పెరగడంతో.. పర్యాటకుల తాకిడి పెరుగుతోంది. శ్రావణ మాసంతోపాటు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం పర్యాటకులు పెరగడానికి కారణమని తెలుస్తోంది. పర్యాటక శాఖ తాజాగా వెల్లడించిన లెక్కల ప్రకారం.. ఎక్కువ మంది పర్యాటకులు వచ్చిన ప్రదేశాల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో ఉండగా జగిత్యాల ఐదో స్థానంలో నిలిచాయి. మొత్తానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు గత ఏడాది 65 లక్షల 76 వేల 73 మంది పర్యాటకులు వస్తే.. ఈ సంవత్సరం ఒక కోటి 64 లక్షల 53 వేల 235 మంది సందర్శించారు. ఈ ఏడాది 8 నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రదేశాలకు 6.51 కోట్ల మంది వెళ్లగా.. అందులో రాజన్న సిరిసిల్ల జిల్లాకు వచ్చినవారే 1.27 కోట్ల వరకున్నారు. మొత్తం పర్యాటకుల్లో ఇక్కడికి వచ్చినవారే దాదాపు 20 శాతం. వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఉండటం రాజన్న సిరిసిల్ల జిల్లాకు, కొండగట్టు, ధర్మ పురి దేవస్థానాలు ఉండటం జగిత్యాల జిల్లాకు కలిసొచ్చింది. వచ్చిన పర్యాటకుల్లో 62 శాతం మహిళలున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వీరికి కలిసొచ్చింది. గతేడాదితో పోలిస్తే ఈసారి ఉమ్మడి జిల్లాకు వచ్చిన పర్యాటకుల సంఖ్య దాదాపుగా మూడింతలకు పెరిగిందఇప్పటికే ఈ ఏడాదిలో కోటిన్నరకు పైగా సందర్శకులు ఉమ్మడి జిల్లాకు వచ్చారు. 2024 సంవత్సరంలో ఆగస్టు వరకు ఉమ్మడి జిల్లాకు ఏకంగా 1,64,53,235 మంది వచ్చారు. ఈ ఏడాది నెలకు సగటున 20 లక్షలకు పైగా వస్తున్నారు. సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో మరో 80 లక్షల మంది నాలుగు జిల్లాలకు వచ్చారని అంచనా. గతేడాది జనవరి నుంచి ఆగస్టు వరకు వచ్చిన వారు 65.76 లక్షలు ఉండగా.. ఈసారి ఆదే ఎనిమిది నెలల వ్యవధిలో 1.64 కోట్ల మంది ఉమ్మడి జిల్లాకు రావడం విశేషం. హైదరాబాద్‌కు 160 కి.మీ.ల దూరమే ఉండటం, రాజీవ్ రహదారి అనుకూలంగా మారడం, ప్రతి 10 నిమిషాలకో బస్సు సౌకర్యం ఉండటంతో ఎక్కువ మంది రాగలుగు తున్నారు. ఇటు వరంగల్, అటు సిద్దిపేట జిల్లాలోని దేవాలయాలకు వచ్చిన వారు రాజన్న ఆలయానికి, కొండగట్టుకు వచ్చి వెళ్తుంటారు. శుభకార్యాలకు వచ్చినవారు ఇక్కడి ప్రాంతాల్ని చూస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరులో మేడారం సమ్మక్క- సారలమ్మ జాతర జరిగింది. అక్కడికి వెళ్లే భక్తులు ముందుగా వేములవాడ రాజరాజేశ్వర దేవాలయాన్ని దర్శించుకుంటారు. ఇది ఉమ్మడి కరీంనగర్ పాటు చుట్టుపక్కల జిల్లాల భక్తులకు ఆనవాయితీ. ఈ కారణంగా కూడా పర్యాటకుల తాకిడి పెరిగింది. మాసంలో జగిత్యాల జిల్లాలోని ధర్మపురి, కోటిలింగాల దేవాలయాలకు ఎక్కువ సంఖ్యలో భక్తులు రావడంతో ఈ సారి సందడి కనిపించింది. హనుమాన్ దీక్షాపరులు కొండగట్టుకు ఎక్కువగా విచ్చేయడంతో ఈసారి భక్తుల తాకిడి పెరిగింది. కరీంనగర్ జిల్లాలోని రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్ సందర్శనకు పర్యాటకులు వచ్చారు. వర్షాకాలంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎగువ, మధ్య మానేరు జలాశయాలు, కరీంనగర్ జిల్లా దిగువ మానేరు జలాశయాలకు కూడా పర్యాటకుల తాకిడి పెరిగింది. వరదలతో గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదలడంతో.. పరవళ్లను వీక్షించడానికి పెద్దఎత్తున తరలివచ్చారు.

# ఈ యేడాది పెరిగిన ఎమర్జెన్సీ కాల్స్

## అగ్ని మాపక దళ వార్షిక నివేదిక

హైదరాబాద్: 15మీటర్స్ పైన ఉన్నవి అన్ని హై రైస్ బిల్డింగ్ కింద పరిగనిస్తాం. ప్రతి హై రైస్ బిల్డింగ్ లో శిక్షణ కలిగిన ఫైర్ సిబ్బంది వుంటారు. ప్రతి హై రైస్ బిల్డింగ్ లో ఫైర్ స్ప్రింక్లర్ ఉంటుంది.. పొగ రాగానే వెంటనే నీళ్లు చల్లి ఆర్పేలా సిస్టమ్ మెయింటైన్ చేస్తారని అగ్ని మాపక దళం డీజీపీ నాగిరెడ్డి వెల్లడించారు. రెండు గంటలపాటు ఫైర్ ఎక్కువ వ్యాపించకుండా అన్ని రకాల చర్యలు హై రైస్ బిల్డింగ్ లో ఉండేలా చర్యలు తీసుకుంటాం. హైదరాబాద్ 3500వరకు హై రైస్ బిల్డింగ్ వున్నాయి. 700వరకు ఎన్ఓసి లు ఇచ్చాము. కొన్ని ఇంకా నిర్మాణం లో వున్నాయి. 2024సంవత్సరంలో 7383 ఫైర్ కాల్స్ వచ్చాయని అన్నారు. 7093స్మాల్ ఫైర్, 180మీడియం ఫైర్ కాల్స్, 87సీరియస్ ఫైర్ ఆక్సిడెంట్ కాల్స్,24మేజర్ ఫైర్ కాల్స్ వచ్చాయి. 2023తో పోలిస్తే 2024లో ఫైర్ కాల్స్ 0.23%తగ్గాయి. రెస్క్యూ కాల్స్ లో భాగంగా 1767వరద సహాయక కాల్స్ రాగ, అగ్ని ప్రమాదాలు 495,లిఫ్ట్ రెస్క్యూ 40కాల్స్, ఇతర కాల్స్ 54, జంతువుల రక్షణ 103వరకు వచ్చాయి.. 2023తో పోలిస్తే ఈ సంవత్సరం లో 7.29శాతం రెస్క్యూ కాల్స్ పెరిగాయి. అత్యవసర ఫైర్ కాల్స్ లో భాగంగా డెడ్ బాడీ రికవరీ 435,మరియు జంతువు రికవరీ 6 కాల్స్ వచ్చాయి. వాహన ప్రమాదాలు 28,రోడ్ ప్రమాదాలు 25,కూలిన భవనాలు10,కూలిన చెట్లు 22,సెలర్స్ 27 ఫైర్ కాల్స్ వచ్చాయని అన్నారు. 2023తో పోలిస్తే ఈ సంవత్సరం లో ఎమర్జెన్సీ కాల్స్ 10.82శాతం పెరిగాయి. ఫైర్ సేఫ్టీ కై అనేక అవగాహనా కార్యక్రమలు చేస్తున్నాం. అందులో భాగంగా పలు ఆకస్మిక తనిఖీలు చేసామని అన్నారు. 42,772హాస్పిటల్ లో తనిఖీ మరియు అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేసాము.. 19581పరిశ్రమలలో ఫైర్ అవగాహనా కార్యక్రమాలు చేసాము..

విద్యసంస్థలలో 6370,రెసిడెన్సీయల్ 6331,ఇతర అవగాహనా కార్యక్రమాలతో పాటు మొత్తం 15లక్షల వరకు తెలంగాణ వ్యాప్తంగా అవగాహనా కార్యక్రమాలు చేసాము. 2023తో పోలిస్తే ఈ సంవత్సరం అవగాహనా కార్యక్రమాలు 81.71శాతం పెరుగుదల నమోదు అయింది. ఫైర్ డిపార్ట్మెంట్ ద్వారా ప్రభుత్వనికి 34.79కోట్లు ఆదాయం వచ్చిందని వెల్లడించారు.

# పేది ఎకరాలు లోపే.. రైతు భరోసా

నిజామాబాద్: సంక్రాంతి నుంచి రైతు భరోసా ఇవ్వాలని భావిస్తున్న తెలంగాణ ప్రభుత్వం.. విధివిధానాల రూపకల్పనపై దృష్టి పెట్టింది. ఇందులో కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. గత ప్రభుత్వంలో లాగా నిబంధనలు లేకుండా రైతు భరోసా అందించకూడదని, సాగు చేసే రైతులకే ఇవ్వాలని సూత్రప్రాయం నిర్ణయించింది. ఇటు 10 ఎకరాల లోపు ఉన్న రైతులకే రైతు భరోసా ఇచ్చే అంశంపై క్యాబినెట్ భేటీలో చర్చించాలని నిర్ణయం తీసుకుంది. ఇటు మరోసారి వచ్చే వారం సబ్ కమిటీ భేటీ కానుంది. రైతు భరోసా పంపిణీ విధివిధానాలపై క్షుణ్ణంగా చర్చించనుంది. రానున్న యాసంగి పంటకు రైతుభరోసా అందించేందుకు ఖరారు చేయాల్సిన విధివిధానాలపై సబ్ కమిటీ చర్చించింది. పథకం ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు రైతు భరోసా అందించిన తీరుపై సమీక్షించింది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా సబ్ కమిటీ పర్యటించిన సమయంలో రైతుల వ్యక్తం చేసిన అభిప్రాయాలు, అధికారులు సేకరించి సమాచారం పైన మంత్రులు కసరత్తు చేశారు. సంక్రాంతి నుంచి రైతు భరోసా చెల్లించాలని ఇప్పటికే ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఆ మేరకు అందుకు సంబంధించిన కసరత్తును కేబినెట్ సబ్ కమిటీ చేసింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన సమావేశమైన క్యాబినెట్ సబ్ కమిటీ.. దాదాపు గంటన్నర పాటు సమావేశమైంది. గత 6 నెలలుగా రైతు భరోసా విధివిధానాలు, మార్గదర్శకాలకు సంబంధించి తెలంగాణ వ్యాప్తంగా రైతుల అభిప్రాయాలతో పాటు వివిధ రంగాల ప్రముఖుల అభిప్రాయాలను క్యాబినెట్ సబ్ కమిటీ సేకరించింది. అందులో ప్రధానంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం బేషరతు గా రైతుబంధు చెల్లించింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అలా కాకుండా కొన్ని నిబంధనలు పెట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. ఎన్ని ఎకరాల వరకు రైతు భరోసాను అమలు చేయాలనే కీలక అంశం మంత్రివర్గంలో చర్చకు వచ్చింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎకరాలతో సంబంధం లేకుండా రైతు భరోసా అందించారు. ఈ విధానంపై రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమయ్యింది. వందల ఎకరాల పొలాలున్న రైతులకు పెట్టుబడి సాయం ఎందుకనే ప్రశ్నలు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో ఎన్ని ఎకరాలలోపు రైతులకు రైతు భరోసా అందిస్తే బాగుంటుందనే విషయం పై మంత్రివర్గం చర్చించింది. పెట్టుబడి కోసం అధిక వడ్డీలు తీసుకుని ఇబ్బందులు పడకుండా నిరోధించడం, అప్పులు చేసిన వారికే తక్కువ ధరకు పంటల్ని విక్రయించకుండా చేసేందుకు రైతు భరోసా అక్కరకు వస్తుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకునే.. చిన్న, సన్నకారు, మధ్యస్థాయిలో రైతులకు మాత్రమే రైతు భరోసా అందించేలా నిబంధన పెడితే ఎలా ఉంటుందన్న చర్చ జరిగింది. కానీ.. ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అలాగే.. ప్రభుత్వానికి పన్ను చెల్లింపుదారులు, ప్రభుత్వ ఉద్యోగులను సైతం రైతు భరోసాకు అనర్హులుగా ప్రకటించాలనే చర్చ నడిచింది. కాగా.. ఈ విషయాలపై ఇంకా ఎలాంటి పూర్తి స్పష్టత రాలేదని మంత్రివర్గం వెల్లడించింది. అందులో ప్రధానంగా పంటలు వేసిన భూములకు మాత్రమే రైతుభరోసా చెల్లించాలని, దాంతో పాటు ఎకరాల విషయంలో కొంత కటాఫ్ పెట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. 7 నుంచి 10 ఎకరాలలోపు భూములు ఉన్న వారికే రైతుభరోసా చెల్లించాలని క్యాబినెట్ సబ్ కమిటీ ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలుస్తోంది.

# న్యూ ఇయర్ సంబరాలు చేసుకోండి

## కండిషన్స్ అప్లై అంటున్న పోలీసులు

హైదరాబాద్: మరి కొన్ని గంటల్లో కొత్త సంవత్సరానికి స్వాగతం పలకబోతున్నాం. ఈ క్రమంలో భాగ్యనగరంలో న్యూఇయర్ సెలబ్రేషన్స్‌కు అంతా సిద్ధమవుతున్నారు. వేడుకల సందర్భంగా నగర పోలీసులు సైతం పటిష్ట చర్యలు చేపట్టారు. పబ్బులు, బార్ అండ్ రెస్టారెంట్స్, హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నార్కోటిక్, ఎక్సైజ్, ఎస్ఓటీ, మాధాపూర్ పోలీసుల ఆధ్వర్యంలో ఈ సోదాలు చేశారు. మైనర్లను బార్లు, పబ్‌లకు అనుమతిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వేడుకల సమయంలో సౌండ్ పొల్యూషన్ లేకుండా చూడాలని సౌండ్ ప్రూఫ్ మెయింటైన్ చేయాలని పబ్ యజమానులను ఆదేశించారు. అటు, జూబ్లీహిల్స్‌లో మొత్తం 36 పబ్‌లు ఉండగా.. ఇందులో నాలుగింటికి పోలీసులు అనుమతులు నిరాకరించారు. హార్డ్ కప్, అమ్నేషియా, బ్రాడ్ వే, బేబీలాన్ పబ్‌లకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. గతంలో ఆయా పబ్‌ల్లో జరిగిన గొడవలు, పోలీస్ కేసుల కారణంగా ఆంక్షలు విధిస్తూ అనుమతి ఇవ్వడం లేదని పోలీసులు స్పష్టం చేశారు. అర్ధరాత్రి ఒంటి గంటలోగా వేడుకలు ముగించుకోవాలని తెలిపారు. మద్యం సేవించిన కస్టమర్లు వాహనాలు నడపడానికి అనుమతించకూడదని.. నిబంధనలు పాటించకుంటే సంబంధిత యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని అన్నారు. మద్యం సేవించిన వారి ప్రయాణానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మరోవైపు, న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా 3 కమిషనరేట్ల పరిధిలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. డిసెంబర్ 31న అర్ధరాత్రి దాటాక ఓఆర్ఆర్‌తో పాటు అన్ని ఫ్లైఓవర్లు మూసివేయనున్నారు. శిల్పా లేఅవుట్, గచ్చిబౌలి ఫ్లైఓవర్, బయో డైవర్సిటీ ఫ్లైఓవర్లు, షేక్ పేట్, మైండ్ స్పేస్, రోడ్ నెం.45 ఫ్లైఓవర్, దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జి, సైబర్ టవర్ ఫ్లైఓవర్, ఫోరమ్ మాల్ ఏజెజ ఫ్లైఓవర్, ఖైత్లాపూర్ ఫ్లై ఓవర్, బాబు జగ్జీవన్ రామ్ ఫ్లై ఓవర్‌ను రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకూ మూసివేయనున్నారు. క్యాబ్‌లు, ట్యాక్సీ, ఆటో డ్రైవర్లు కచ్చితంగా యూనిఫామ్ ధరించాలని, వాహనానికి సంబం ధించిన డాక్యుమెంట్స్ వెంట ఉంచుకోవాలని పోలీసులు సూ చించారు. క్యాబ్ డ్రైవర్లు ఎట్టిపరిస్థితుల్లోనూ రైడ్ రిజెక్ట్ చెయ్యొద్దని.. నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.500 జరిమానా విధిస్తామని హెచ్చరిం చారు. ఒకవేళ ఎవరైనా రైడ్ రిజెక్ట్ చేస్తే వాహనం నెంబర్, టైం, ప్రదేశం వంటి వివరాలతో వాట్సాప్ నెంబరు 9490617346 కు ఫిర్యాదు చెయ్యొచ్చని సూచించారు. ప్రజలతో మర్యాదగా మసులు కోవాలని.. అదనపు ఛార్జీలు డిమాండ్ చేయకూడదని స్పష్టం చేశారు. రాత్రి 8 గంటల నుంచే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతామని.. సరైన పత్రాలు లేకుంటే వాహనాలు స్వాధీనం చేసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. పోలీస్ విధులకు ఆటంకం కలిగించొద్దని, మైనర్లు డ్రైవింగ్ చేస్తే వాహనాన్ని సీజ్ చేసి యజమానిపై కేసు నమోదు చేస్తామన్నారు. వాహనాల్లో అధిక డెసిబెల్స్, మ్యూజిక్ సిస్టమ్‌లను ఉపయోగించడం నిషేధమని.. నెంబర్ ప్లేట్స్ లేని వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని అన్నారు. మద్యం తాగి వాహనం నడిపే ప్రతి ఒక్కరిపైనా కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని స్పష్టం చేశారు.

# బోర్డర్ లో కనిపించని వ్యాపారాలు

హైదరాబాద్: మద్యం అంటే మగవాళ్లు చిందులేస్తారు.. ఉత్సాహంగా సేవించడానికి ముందుకు వస్తారు.. దీంతో మందు బాబులతో మద్యం షాపులు ఎప్పటికీ కిటకిటలాడతాయి. ఇక దసరా సంక్రాంతి తో పాటు న్యూ ఇయర్ సందర్భంగా మద్యం షాపులకు క్యూ కడుతూ ఉంటారు. మిగతా వాటి కంటే మద్యం అమ్మకాల ద్వారానే ఎక్కువ ఆదాయం వస్తున్నందున ప్రభుత్వం సైతం అబ్కారీ శాఖ ద్వారా మద్యం షాపులను సమర్థవంతంగా నిర్వహిస్తోంది. కొన్ని ఏరియాల్లో లాభాలు రావడంతో అక్కడ మద్యం షాపులను ఒకటికి మించి ఏర్పాటు చేస్తోంది. అయితే ఒకప్పుడు మద్యం దొరకాలంటే గంటలకొద్దీ క్యూలో నిలబడాల్సిన షాపులు.. ఇప్పుడు మందుబాబుల కోసం ఎదురుచూస్తున్నాయి. అంతేకాకుండా ఇటీవల ఈ షాపులకు రూ.40 కోట్ల ఆదాయం తగ్గినట్లు తెలుస్తోంది. ఇంతకీ ఆ మద్యం షాపులు ఎక్కడివో తెలుసాతెలుగు రాష్ట్రాల్లో మద్యం అమ్మకాలు విపరీతంగా ఉంటాయి. అందులోనూ తెలంగాణలో మొన్నటి వరకు మద్యం ధరలు తక్కువగా ఉండటంతో ఏపీ నుంచి చాలామంది తెలంగాణ బార్డర్లో ఉన్న షాపుల్లో కొనుగోలు చేసేవారు. హైదరాబాదులోని మద్యం షాపుల తర్వాత తెలంగాణ బార్డర్లో ఉన్న షాపులకే ఎక్కువగా రద్దీ ఉండేది. అయితే ఇప్పుడు ఏపీలో అన్ని రకాల మద్యం బ్రాండ్లు అందుబాటులోకి వచ్చాయి. అంతేకాకుండా తక్కువ ధరకే మద్యం విక్రయించడంతో ఏపీ నుంచి కొనుగోలు చేసేవారి సంఖ్య తెలంగాణ బార్డర్లో లో ఉన్న షాపులకు తగ్గింది. తెలంగాణ బార్డర్ లో ఉన్న నల్లగొండ, ఖమ్మం, మహబూబ్ నగర్ జిల్లాల సరిహద్దు మండలాల్లో ఉన్న షాపులకు ఏపీ నుంచి చాలామంది వచ్చి మద్యం కొనుగోలు చేసేవారు. అయితే ఈ షాపులకు రద్దీ విపరీతంగా పెరగడంతో రేషన్ కార్డు ఆధారంగా మద్యం విక్రయించేవారు ఆదివారం తో పాటు సెలవు దినాల్లో పోలీస్ పహార మధ్య మద్యం విక్రయించేవారు. కానీ ఇప్పుడు ఈ మద్యం షాపులకు ఏపీ నుంచి కొనుగోలు చేసేవారి సంఖ్య విపరీతంగా తగ్గింది. ఒకప్పుడు తీరిక లేకుండా ఉన్న మద్యం షాపులోని సిబ్బంది ఇప్పుడు ఖాళీగా కూర్చుంటున్నారు. అంతేకాకుండా డిసెంబర్ నెలలో ఈ షాపులకు రూ. 40 కోట్ల రూపాయల ఆదాయం తగ్గినట్లు తెలుస్తోంది. సాధారణంగా దసరా, సంక్రాంతి, న్యూ ఇయర్ వేడుకల్లో మద్యం షాపులకు ఎక్కువగా ఆదాయం వస్తుంది. ఆయా జిల్లాలోని షాపుల నుంచి దాదాపు రూ. 300 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉంది. కానీ ఈ దసరా పండుగకు భారీగా ఆదాయం తగ్గినట్లు తెలుస్తోంది .ఇప్పుడు న్యూ ఇయర్ సందర్భంగా కూడా పరిస్థితి ఇలాగే ఉంటే ఏం చేయాలో మని అబ్కారీ శాఖ ఆలోచిస్తుంది. ఏపీలో ఎన్డీఏ సత్తార్ వచ్చిన తర్వాత మద్యం బ్రాండ్లను అందుబాటులో ఉంచడంతోపాటు చాలావరకు ధరలు తగ్గించారు. దీంతో ఈ షాపులకు ఆదాయం తగ్గింది. అయితే ముందు ముందు కూడా ఇక్కడ ఆదాయం తగ్గితే ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి. ఒకవేళ ఈ షాపులకు ఆదాయం తగ్గితే వీటిని కొనసాగిస్తారా? లేదా? అనేది తెలియాల్సి

# కుంభమేళలో లక్ష కోట్ల వ్యాపారం

లక్నో: 2025 జరిగే మహాకుంభమేళా భారతదేశం అతిపెద్ద, అత్యంత ముఖ్యమైన మతపరమైన పండుగ. ఈ పండుగ మతానికి, ఆర్థిక శాస్త్రానికి చాలా ప్రత్యేకమైనది. ఎందుకంటే ఈ సమయంలో అనేక వ్యాపారాలు సంపాదించే అవకాశాలను పొందుతాయి. ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా నిర్వహించాలి. దీనిని ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి జరుపుకుంటారు. ఈసారి జనవరి 13 (పౌష్ పూర్ణిమ) నుండి ఫిబ్రవరి 26 (మహా శివరాత్రి) వరకు జరుపుకుంటున్నారు. డిసెంబరు 13న, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయాగ్‌రాజ్‌ని సందర్శించారు. కుంభమేళ కోసం నగర సౌకర్యాలు, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి మొత్తం రూ. 5,500 కోట్లతో నిర్మాణ ప్రాజెక్టులను ప్రారంభించారు. అయితే, దీనికి ముందు మోదీ సంగంలో పూజలు కూడా చేశాడు. ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి జరిగే మహా కుంభమేళా కోసం లక్షలాది మంది యాత్రికులు, పర్యాటకులు అతిథేయ నగరాన్ని సందర్శిస్తారు. 2025లో ప్రయాగ్‌రాజ్‌కు 40-50 కోట్ల మంది పర్యాటకులు వస్తారని అంచనా వేయబడింది. ఇది అక్కడి స్థానిక ఆర్థిక వ్యవస్థను గణనీయంగా పెంచుతుంది. మతపరమైన ప్రాముఖ్యతతో పాటు, మహా కుంభ్ వంటి సంఘటనలు పర్యాటకం ద్వారా ఉపాధిని సృష్టించడానికి, ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడానికి కూడా ఉపయోగపడతాయి. ఇది సమీపంలోని కంపెనీలకు ప్రయోజనం చేకూరుస్తుంది. మొత్తం భారతదేశ ఆర్థిక వ్యవస్థకు ఊతం వస్తుంది. మహా కుంభ సమయంలో లక్షలాది మంది ప్రజలు ఈ తీర్థయాత్రలను సందర్శిస్తారు. కుంభమేళాలో వసతి కోసం డిమాండ్ పెరుగుతుంది. ఈ పెరుగుదల ట్రావెల్ ఏజెన్సీలు, వసతి సౌకర్యాలు, తినుబండారాలు, టూర్ ఆపరేటర్లకు సహాయపడుతుంది. కుంభమేళా టెంట్ రెంటల్స్ వంటి సేవలు, ఉత్సవ ప్రదేశానికి దగ్గరగా అతిథులకు సులభమైన, ఆకర్షణీయమైన వసతి ఎంపికలను అందిస్తాయి. ఇవి కూడా అధిక డిమాండ్‌లో ఉన్నాయి. టూరిజం వ్యాపారంలో విమాన, రైలు, రోడ్డు రవాణా కోసం రిజర్వేషన్లు వేగంగా వృద్ధి చెందడం ద్వారా అన్ని పరిశ్రమల రంగాలకు ప్రధాన ఆదాయ వనరుగా ఉంది. నిర్మాణం, భద్రత, ఆరోగ్య సంరక్షణ, ఈవెంట్ ప్లానింగ్ వంటి పరిశ్రమలలో పెద్ద సంఖ్యలో తాత్కాలిక, శాశ్వత ఉద్యోగ అవకాశాలను సృష్టించడం ద్వారా మహా కుంభ్ ఈ ప్రాంతంలో నిరుద్యోగాన్ని తగ్గిస్తుంది. చిన్న వ్యాపారాలు, కళాకారులు తమ వస్తువులను విక్రయించడానికి గొప్ప అవకాశాన్ని కలిగి ఉన్నారు, ఇది స్థానిక సంఘాలకు కూడా ప్రయోజనం చేకూరుస్తుంది. యాత్రికులు స్థానిక వ్యాపారాలకు మద్దతుగా పెద్ద మొత్తంలో ఆహారం, దుస్తులు, మతపరమైన వస్తువులు, సావనీర్‌లను కొనుగోలు చేస్తారు. వ్యక్తిగత విక్రేతలకు సహాయం చేయడమే కాకుండా, ఈ విస్తరణ స్థానిక వంటకాలు, కళలు, హస్తకళలకు డిమాండ్‌ని సృష్టించడం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థను పెంచుతుంది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ మునుపటి అంచనాల ప్రకారం, 2019 కుంభమేళా మొత్తం రూ. 1.2 లక్షల కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. అయితే అంతకుముందు 2013లో జరిగిన మహా కుంభ్ హోటళ్లు, విమానాశ్రయ మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేయడంతో సహా మొత్తం రూ. 12,000 కోట్లను ఆర్జించింది. ఆదాయం లభించింది.

# కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయండి

హైదరాబాద్: కాంట్రాక్ట్ అధ్యాపకులను సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రెగ్యులరైజ్ చేయాలని చేయాలని ఒకవేళ రెగ్యులరైజ్ చేసే ప్రక్రియ ఆలస్యం అయితే బేసిక్, డి ఎ, హెచ్ఆర్ మరియు 3% తో కూడిన స్కేల్ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మాసబ్ ట్యాంక్ ఉన్నత విద్యా మండలి ఎదుట 12 యూనివర్సిటీలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు మహాధర్నా నిర్వహించారు. 10 నుండి 30 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిని నమ్ముకొని ఉంటున్నతమణి ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన పిమ్మటే నోటిఫికేషన్లు విడుదల చేయాలని లేని పక్షంలో కాంట్రాక్టు ఉద్యోగులు మరియు వారి కుటుంబాలు రోడ్డుపైకి వచ్చే అవకాశం ఉందని అన్నారు. దేవుడు కరుణించిన పూజారి వరమీయ లేనట్లు సీఎం రేవంత్ రెడ్డి చేస్తామని అన్నా కూడా ఉన్నత విద్యా మండలి అధికారులు సరిగ్గా పట్టించుకోవడంలేదని నిరాశ వ్యక్తం చేశారు.

# ఈ ఏడాది బెస్ట్ మూమెంట్ ఇదే!

ఈ ఏడాది(2024)కి గుడ్‌బై చెప్పే టైమ్ వచ్చింది. మరికొద్ది గంటల్లో 2025 నూతన ఏడాదిలోకి అడుగుపెట్టబోతున్నాం. 2024 టీమిండియాకు మరిచిపోలేని జ్ఞాపకాలను మిగిల్చింది.

ముఖ్యంగా టీ20 క్రికెట్‌లో టీమిండియా ఆధిపత్యం కొనసాగింది. 17 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ.. టీమిండియా టీ20 ప్రపంచకప్ 2024 గెలుచుకుంది.

అమెరికా, వెస్టిండీస్ సంయుక్తంగా నిర్వహించిన టీ20 ప్రపంచకప్ 2024లో అసాధారణ ప్రదర్శన కనబర్చిన టీమిండియా విశ్వవిజేతగా నిలిచింది. సౌతాఫ్రికాతో ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగిన ఫైనల్లో విరాట్ కోహ్లీ(59 బంతుల్లో 76) సూపర్ బ్యాటింగ్.. జస్‌ప్రీత్ బుమ్రా సెన్సేషనల్ బౌలింగ్.. హార్దిక్ పాండ్యా ఆల్‌రౌండ్ షో.. సూర్యకుమార్ యాదవ్ స్టన్నింగ్ క్యాచ్.. రిషభ్ పంత్ అతి తెలివి.. రోహిత్ సూపర్ కెప్టెన్సీ టీమిండియాకు విజయాన్నందించాయి.

13 ఏళ్ల నిరీక్షణ తర్వాత టీమిండియా ఐసీసీ టైటిల్‌ను ముద్దాడింది. ఈ అపూర్వ విజయంతో భారత ఆటగాళ్ల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఈ మ్యాచ్ అనంతరం రోహిత్ శర్మ రోబోలా నడుచుకుంటూ వచ్చి టీ20 ప్రపంచకప్ ట్రోఫీని అందుకున్న తీరు అందర్నీ ఆకట్టుకుంటోంది. రోహిత్ ఐకానిక్ వాకింగ్ స్టైల్ చూసి తోటి ఆటగాళ్లతో పాటు జై షా నవ్వుల్లో మునిగిపోయారు. ఆ తర్వాత ఈ ఐకానిక్



సెలెబ్రేషన్స్ పాపులర్ అయ్యింది.

లియోనెల్ మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనా జట్టు ఖతార్ వేదికగా జరిగిన ఫైనల్లో ఫ్రాన్స్‌ను ఓడించి ఫిఫా ప్రపంచ కప్ 2022ను గెలుచుకున్న విషయం తెలిసిందే. ఆ సందర్భంలో లియోనెల్ మెస్సీ ఈ ఐకానిక్ మూమెంట్‌తో ట్రోఫీని లిఫ్ట్ చేశాడు. దీంతో అప్పటి నుంచి ఇది బాగా పాపులర్ అయింది. మెస్సీ తరహాలో ట్రోఫీ అందుకోవాలని కుల్దీప్ యాదవ్.. రోహిత్ శర్మ సూచించాడు. దాంతో ఈ ఐకానిక్ ట్రోఫీ సెలెబ్రేషన్ మరింత పాపులర్ అయ్యింది. 2024లోనే ది బెస్ట్ మూమెంట్ ఇదేనని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.

# బాగా క్రికెట్ ఆడితే పీఆర్ అవసరం రాదు: ధోనీ

సోషల్ మీడియా, పబ్లిక్ రిలేషన్స్(పీఆర్) ప్రచారాలపై టీమిండియా దిగ్గజ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. బాగా ఆడితే ఎలాంటి పీఆర్ అవసరం లేదన్నాడు.

అనామక ఆటగాడిగా భారత క్రికెట్‌లో ఎంట్రీ ఇచ్చిన ధోనీ అసాధారణ ప్రదర్శనతో టీమిండియా కెప్టెన్‌గా ఎదిగాడు.

తన సారథ్యంలో భారత్‌ను మూడు సార్లు విశ్వవిజేతగా నిలబెట్టి ఈ ఘనత సాధించిన తొలి కెప్టెన్‌గా చరిత్రకెక్కాడు. 2007 టీ20 ప్రపంచకప్, 2011 వన్డే ప్రపంచకప్, 2013 ఛాంపియన్స్ ట్రోఫీలో ధోనీ సారథ్యంలోనే టీమిండియా గెలుచుకుంది. దాంతోనే ధోనీకి విపరీతమైన పాపులారిటీ సొంతమైంది.

ప్రపంచవ్యాప్తంగా అతనికి అభిమానులు ఉన్నారు. అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమైన ఐదేళ్లు అవుతున్నా అతని చరిష్మా తగ్గడం లేదు. కేవలం ఐపీఎల్‌లో మాత్రమే కొనసాగుతున్న ధోనీ బ్రాండ్ వాల్యూ కోహ్లీతో సమంగా ఉంది.

తాజాగా ఓ ఇంటర్వ్యూలో ధోనీని పీఆర్ మేనేజ్‌మెంట్ గురించి ప్రశ్నించగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'నేనెప్పుడూ సోషల్ మీడియాకు పెద్ద అభిమానిని కాదు. 2004లో నేను అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టాను. ఆ సమయంలో ట్విటర్ అప్పుడప్పుడే పాపులర్ అవుతోంది.

ఆ తర్వాత ఇన్‌స్టాగ్రామ్ వచ్చింది. మనం కూడా పీఆర్ క్యాంపెయిన్ చేద్దామని నా మేనేజర్లంతా చెప్పేవారు. అయితే నేను వద్దన్నాను. నేను క్రికెట్ బాగా ఆడితే ఎలాంటి పీఆర్ అవసరం రాదాని వారికి చెప్పాను.'అని ధోనీ చెప్పుకొచ్చాడు.

సోషల్ మీడియా రాజ్యమేలుతున్న ఈతరంలో ప్రతీ ఒక్కరు పీఆర్



మేనేజ్‌మెంట్ చేస్తున్నారు. ముఖ్యంగా రాజకీయ నాయకులు, సినీ, క్రికెట్ సెలెబ్రిటీలు తమ పాపులారిటీని పెంచుకోవడానికి పీఆర్‌లను నియమించుకుంటున్నారు. సెలెబ్రిటీలకు సంబంధించిన విషయాలను సోషల్ మీడియా, మీడియా వేదికగా ప్రచారం చేయడమే పీఆర్‌ల పని.

2004లో బంగ్లాదేశ్‌తో జరిగిన వన్డే మ్యాచ్‌తో ధోనీ అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు. ఫస్ట్ మ్యాచ్‌లోనే ధోనీ డకౌటయ్యాడు. వైజాగ్ వేదికగా పాకిస్థాన్‌తో జరిగిన వన్డేలో విధ్వంసకర శతకంతో తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. ఆ క్షణం నుంచి ధోనీ వెనుదిరిగి చూసుకోలేదు. 2019 వన్డే ప్రపంచకప్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన సెమీఫైనల్లో చివరి మ్యాచ్ ఆడాడు. యాదృశ్చికమో ఏమో కానీ ఆ మ్యాచ్‌లో కూడా ధోనీ రనౌటయ్యాడు. 2020 ఆగస్ట్ 15న ధోనీ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అప్పటి నుంచి కేవలం ఐపీఎల్ మాత్రమే ఆడుతున్నాడు.

# జస్ప్రీత్ బుమ్రాకు అరుదైన గౌరవం..!

ఇండియా స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా అరుదైన గౌరవం దక్కింది. క్రికెట్ ఆస్ట్రేలియా జస్ప్రీత్ బుమ్రాను టీమ్ ఆఫ్‌ది ఇయర్‌కు కెప్టెన్‌గా ఎంపిక చేసింది.

అతను 2024లో 71 వికెట్లతో వికెట్ టేకర్స్ జాబితాలో అగ్రస్థానంలో నిలిచాడు. మూడు ఫార్మాట్లలో 84 వికెట్లతో 2024లో అత్యధిక వికెట్లు తీసిన ఆటగాళ్ల జాబితాలో అగ్రస్థానంలో నిలిచాడు. 2024లో అంతర్జాతీయంగా అత్యధిక వికెట్లు తీసిన రెండో ఆటగాడు వనిందు హసరంగా కేవలం 64 వికెట్లు మాత్రమే తీశాడు.

ఇద్దరి మధ్య 22 వికెట్ల తేడా ఉంది. 11 సంవత్సరాల తర్వాత భారత్‌కు ఐసీసీ ట్రోఫీని అందించిన వారిలో బుమ్రా కీలకంగా ఉన్నాడు.

జూన్‌లో జరిగిన 2024 ఐసీసీ %ట%20 ప్రపంచ కప్ జస్ప్రీత్ సత్తా చాటాడు. 2024-25 బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియాతో జరిగిన మొదటి టెస్టులో భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. అంతే కాదు జట్టుకు విజయాన్ని అందించాడు. పెర్త్ టెస్ట్ లో ఆస్ట్రేలియాపై ఇండియా 295 పరుగులు తేడాతో విజయం సాధించింది.

ఈ మ్యాచ్ లో బుమ్రా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికైన సంగతి తెలిసిందే. ఆస్ట్రేలియాతో జరిగిన నాలుగు టెస్టుల్లో బుమ్రా 30 వికెట్లు పడగొట్టాడు. ఈ సిరీస్ లో అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్ గా ఉన్నాడు. ఆసీస్ కెప్టెన్ పాట్ కమిన్స్ 20 వికెట్ల మాత్రమే తీశాడు. బుమ్రా కంటే 10 వికెట్ల వెనకాల ఉన్నాడు. బుమ్రా తన ప్రభావవంతమైన బౌలింగ్, అతని జట్టుకు అనుకూలంగా మ్యాచ్‌ను స్వింగ్ చేయగల సామర్థ్యం కారణంగా ఇప్పటికే లెజెండ్ హోదాను



సాధించాడు.

బుమ్రాతో పాటు అతని సహచరుడు యశస్వి జైస్వాల్, న్యూజిలాండ్‌కు చెందిన రచిన్ రవీంద్ర, ఇంగ్లండ్‌కు చెందిన జో రూట్, ఆస్ట్రేలియాకు చెందిన జోష్ హేజిల్‌వుడ్, అలెక్స్ కారీ కూడా క్రికెట్ ఆస్ట్రేలియా 2024 అత్యుత్తమ జట్టులో తమ స్థానాన్ని దక్కించుకున్నారు. జైస్వాల్ ఈ ఏడాది 15 మ్యాచ్ ల్లో 1478 పరుగులు చేశాడు. ఇందులో 3 సెచరీలు, 9 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. క్రికెట్ ఆస్ట్రేలియా జట్టులో యశస్వి జైస్వాల్ (%×చీణ%), బెన్ డకెట్ (%జుచీ+%), జో రూట్ (%జుచీ+%), రచిన్ రవీంద్ర (%ల్గీ%), హ్యారీ బ్రూక్ (%జుచీ+%), కమిందు మెండిస్ (%వూ%), అలెక్స్ కారీ (%ఖూఖూ%), మాట్ హెన్రీ (%ల్గీ%), జస్ప్రీత్ బుమ్రా (కెప్టెన్) (%×చీణ%), జోష్ హేజిల్‌వుడ్ (%ఖూఖూ%), కేశవ్ మహారాజ్ (%వూ%) ఉన్నారు.

# రోహిత్ శర్మ సంచలన నిర్ణయం!

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ముగిసిన అనంతరం హిట్ మ్యాన్ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికే అవకాశం ఉంది. ఒకవేళ టీమిండియా.. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) ఫైనల్ చేరకుంటే.. సిడ్నీ టెస్ట్‌తోనే సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నాడని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. రిటైర్మెంట్ విషయంపై రోహిత్ శర్మ సెలెక్టర్లకు కూడా సమాచారం ఇచ్చారని ఓ బీసీసీఐ అధికారి మీడియాకు తెలిపాడు. 'పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న రోహిత్ శర్మ సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికేందుకు సిద్దమయ్యాడు. టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరకుంటే.. సిడ్నీ టెస్ట్ అనంతరం రిటైర్మెంట్ ప్రకటించాలని నిర్ణయించుకున్నాడు. సెలెక్టర్లకు కూడా సమాచారమిచ్చాడు. రోహిత్ శర్మ స్థానంలో జస్‌ప్రీత్ బుమ్రా కెప్టెన్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.'అని సదరు అధికారి తెలిపాడు. ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో భారత్ 1-2తో వెనుకంజలో నిలిచింది. జనవరి 3 నుంచి సిడ్నీ వేదికగా ఆఖరి టెస్ట్ ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తేనే టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలు సజీవంగా ఉంటాయి. సిడ్నీ టెస్ట్ గెలిచి బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 2-2తో టీమిండియా సమం చేయాలి. అప్పుడు శ్రీలంక-ఆస్ట్రేలియా మధ్య జరిగే రెండు టెస్ట్‌ల సిరీస్ డ్రా అయినా.. ఒక మ్యాచ్‌లో ఆసీస్ ఓడినా.. భారత్ ఫైనల్ చేరుతోంది. ఇప్పటికే సౌతాఫ్రికా ఫైనల్‌కు అర్హత సాధించింది. రెండో స్థానం కోసం ఆసీస్, భారత్ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. సిడ్నీ టెస్ట్ గెలిస్తే టీమిండియాకు అవకాశాలు ఉన్నాయి. శ్రీలంక పర్యటనలో స్పిన్ వికెట్‌పై ఆసీస్ గెలవడం కష్టమే. కాబట్టి సిడ్నీ టెస్ట్‌లో టీమిండియా గెలవాలి. ఈ మ్యాచ్ ఓడితే.. రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించే అవకాశం ఉంది. గత 15 ఇన్నింగ్స్‌ల్లో రోహిత్ శర్మ ఒకే ఒక్క హాఫ్ సెంచరీ చేశాడు. తాజా ఆసీస్ పర్యటనలోనూ దారుణంగా విఫలమయ్యాడు. పేలవ బ్యాటింగ్‌తో అతను జట్టుకు భారమయ్యాడు. కెప్టెన్‌గానూ తడబడుతున్నాడు. కెప్టెన్ కాకుంటే రోహిత్ శర్మకు తుది జట్టులో చోటు కూడా దక్కేది కాదని క్రికెట్ ఎక్స్‌పర్ట్స్, ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు.

# కొత్త ఏడాది 2025లో టీమిండియా షెడ్యూల్ ఇదే!

ఆస్ట్రేలియాతో మెల్‌బోర్న్ టెస్ట్ ఓటమితో ఈ ఏడాది(2024)కి ముగింపు పలికిన టీమిండియా.. సిడ్నీ వేదికగా జరిగే చివరి టెస్ట్‌తో కొత్త ఏడాది(2025)కి స్వాగతం పలకనుంది.

ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా సిడ్నీ వేదికగా జనవరి 3 నుంచి 7 వరకు ఆఖరి టెస్ట్ జరగనుంది. ఈ సిరీస్ అనంతరం ఇంగ్లండ్‌తో సొంతగడ్డపై పరిమిత ఓవర్ల సిరీస్ ఆడనుంది.

మూడు టీ20లు, మూడు వన్డేల కోసం ఇంగ్లండ్ భారత పర్యటనకు రానుంది. జనవరి 22 నుంచి ఫిబ్రవరి 12 వరకు ఈ పర్యటన సాగనుంది. ఈ సిరీస్ తర్వాత ఫిబ్రవరి 19 నుంచి ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ జరగనుంది. దుబాయ్ వేదికగా భారత్ మ్యాచ్‌లు జరగనున్నాయి. మార్చి 14 నుంచి మే 25 వరకు ఐపీఎల్ 2025 సీజన్ జరగనుంది. ఐపీఎల్ అనంతరం వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ జరగనుంది. భారత్ క్వాలిఫై అయితే ఈ మ్యాచ్ ఆడనుంది. ఆ తర్వాత జూన్ 20 నుంచి ఇంగ్లండ్ గడ్డపై ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో తలపడనుంది. ఈ సిరీస్‌తోనే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్ ప్రారంభం కానుంది. వచ్చే ఏడాది భారత్ మొత్తం 17 వన్డేలు.. 11 టెస్ట్‌లు ఆడనుంది.

టీమిండియా 2025 షెడ్యూల్..

జనవరి 3 నుంచి 7: సిడ్నీ వేదికగా ఆస్ట్రేలియాతో చివరి టెస్ట్(బీజీటీ)

ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్

జనవరి 22, తొలి టీ20(కోల్‌కతా)

జనవరి 22, రెండో టీ20(చెన్నై)

జనవరి 28, మూడో టీ20(రాజ్‌కోట్)

జనవరి 31, నాలుగో టీ20(పుణె)

ఫిబ్రవరి-, ఐదో టీ20(ముంబై)

ఫిబ్రవరి 6-తొలి వన్డే(నాగ్‌పూర్)

ఫిబ్రవరి 9-రెండో వన్డే(కటక్)

ఫిబ్రవరి 12-మూడో వన్డే(అహ్మదాబాద్)



ఛాంపియన్స్ ట్రోఫీలో భారత షెడ్యూల్

ఫిబ్రవరి 20- భారత్ వర్సెస్ బంగ్లాదేశ్(దుబాయ్)

ఫిబ్రవరి 23-భారత్ వర్సెస్ పాకిస్థాన్(దుబాయ్)

మార్చి 2- భారత్ వర్సెస్ న్యూజిలాండ్(దుబాయ్)

సెమీస్, ఫైనల్‌కు అర్హత సాధిస్తే ఆ మ్యాచ్‌లు..

మార్చి 14 నుంచి మే 25 వరకు ఐపీఎల్ 2025

ఐదు టెస్ట్‌ల కోసం ఇంగ్లండ్ పర్యటనకు భారత్

జూన్ 20-24, తొలి టెస్ట్(లీడ్స్)

జూన్ 2-6, రెండో టెస్ట్(బర్మింగ్‌హామ్)

జూలై 10-14, మూడో టెస్ట్(లండన్, లార్డ్స్)

జూలై 23-27, నాలుగో టెస్ట్(మాంచెస్టర్)

జూలై 31-ఆగస్ట్ 4: ఐదో టెస్ట్(లండన్, కెన్నింగ్‌స్టన్ ఓవల్)

3వన్డేలు, 3 టీ20ల కోసం బంగ్లాదేశ్ పర్యటనకు టీమిండియా(ఆగస్ట్)

వెస్టిండీస్‌తో రెండు టెస్ట్‌ల సిరీస్(అక్టోబర్)

ఆసియా కప్(అక్టోబర్-నవంబర్)

3వన్డేలు, 5 టీ20ల సిరీస్ కోసం ఆస్ట్రేలియా పర్యటనకు టీమిండియా(నవంబర్)

సౌతాఫ్రికాతో 2 టెస్ట్‌లు, 3 వన్డేలు, 5 టీ20ల సిరీస్(డిసెంబర్)

# వ్యక్తి పూజ ఎక్కువైతే ఫలితాలు ఇలానే ఉంటాయి!

ఆస్ట్రేలియాతో మెల్‌బోర్న్ టెస్ట్‌లో టీమిండియాకు ఎదురైన ఘోర పరాజయంపై నెటిజన్లు ఘాటుగా స్పందిస్తున్నారు. వ్యక్తి పూజ ఎక్కువైతే ఇలాంటి ఫలితాలే ఎదురవుతాయని మండిపడుతున్నారు.

ఫామ్‌లో లేని టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ నెత్తిన పెట్టుకోవడంతోనే టీమిండియాకు ఘోర పరాజయం ఎదురైందని అభిప్రాయపడుతున్నారు.

టీమిండియా హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టకుముందు పెద్ద పెద్ద మాటలు మాట్లాడిన గౌతమ్ గంభీర్ ఇప్పుడు మౌనంగా ఎందుకు ఉన్నాడని నిలదీస్తున్నారు. జట్టు కంటే ఎవరూ ఎక్కువ కారని పదే పదే చెప్పిన గంభీర్.. హెడ్ కోచ్‌గా ఆ పని ఎందుకు చేయలేకపోతున్నాడని మండిపడుతున్నారు.

రోహిత్ శర్మ గైర్హాజరీలో జస్‌ప్రీత్ బుమ్రా సారథ్యంలో పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో టీమిండియా చారిత్రాత్మక విజయాన్ని సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో తక్కువ పరుగులకే ఆలౌటైనా.. బుమ్రా సంచలన బౌలింగ్.. అసాధారణ కెప్టెన్సీతో భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. కానీ ఆ జోరును సిరీస్ మొత్తం కొనసాగించలేకపోయింది. విన్నింగ్ కాంబినేషన్‌ను కొనసాగించకుండా.. రోహిత్ శర్మ తిరిగి వచ్చాడని, అతని ఫామ్‌ను పట్టించుకోకుండా తుది జట్టులో ఆడించి టీమిండియా మేనేజ్‌మెంట్ ఘోర తప్పిదం చేసిందని మండిపడుతున్నారు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భారత వైఫల్యానికి ప్రధాన కారణం మేనేజ్‌మెంట్ అనాలోచిత నిర్ణయాలే కారణమని అభిప్రాయపడుతున్నారు. మెల్ బోర్న్ టెస్ట్‌లో కేఎల్ రాహుల్‌ను ఓపెనర్‌గా కొనసాగించకపోవడం.. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న వికెట్‌పై శుభ్‌మన్ గిల్‌ను పక్కనపెట్టడం టీమిండియా విజయవకాశాలను దెబ్బతీసిందని మండిపడుతున్నారు. ప్రత్యర్థి ఆటగాళ్లకు తగ్గట్లు వ్యూహాలు రచించడంలో టీమిండియా



విఫలమైందని చెబుతున్నారు. మరోవైపు ఆసీస్ మాత్రం ప్రతీ బ్యాటర్‌కు తగ్గట్లు వ్యూహాలు రచించి ఫలితాలను రాబట్టిందని, భారత బ్యాటర్లను ఔట్ చేసిన విధానమే ఇందుకు నిదర్శనమని కామెంట్ చేస్తున్నారు.

రోహిత్ శర్మ అందుబాటులోకి వచ్చినా జస్‌ప్రీత్ బుమ్రానే కెప్టెన్‌గా కొనసాగించాలని సిరీస్ ప్రారంభానికి ముందే దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ టీమిండియా మేనేజ్‌మెంట్‌కు సూచించాడు. కానీ అతని సలహాను పట్టించుకోలేదు. బ్యాటింగ్ వైఫల్యంతో తీవ్ర ఒత్తిడిలో ఉన్న రోహిత్ శర్మ.. కెప్టెన్‌గా సరైన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నాడు.

క్రికెట్ అనేది టీమ్ స్పోర్ట్స్ అని, ఒకరో ఇద్దరో ఆడితే విజయాలు దక్కవని, సమష్టిగా రాణించాల్సిందేనని గుర్తు చేస్తున్నారు. ఈ విషయం బాగా తెలిసిన గంభీర్ కూడా పాత పద్దతిలోనే నిర్ణయాలు తీసుకోవడం ఏంటని మండిపడుతున్నారు. వ్యక్తి పూజ ఎక్కువైతే టీమిండియాకు ఘోర పరాజయాలే ఎదురవుతాయని విమర్శించిన గంభీర్.. హెడ్ కోచ్‌గా తాను చేస్తున్న పని ఏంటో ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఫ్యాన్స్ సూచిస్తున్నారు.

# అతని వికెట్ మ్యాచ్‌కు టర్నింగ్ పాయింట్: ప్యాట్ కమిన్స్

టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ వికెట్‌తోనే మెల్‌బోర్న్ టెస్ట్‌పై పట్టు సాధించామని ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అన్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో అతని వికెట్ తమకు కీలకమైందన్నాడు.

ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా సోమవారం ముగిసిన మెల్‌బోర్న్ టెస్ట్‌లో ఆస్ట్రేలియా 184 పరుగుల భారీ తేడాతో టీమిండియాను ఓడించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లో(82, 84) యశస్వి జైస్వాల్ రాణించాడు.

తొలి ఇన్నింగ్స్‌లో అనవసర పరుగుకు ప్రయత్నించి రనౌటైన యశస్వి జైస్వాల్.. రెండో ఇన్నింగ్స్‌లో ఒంటరి పోరాటం చేస్తూ వివాదాస్పద రీతిలో వెనుదిరిగాడు. కమిన్స్ వేసిన షార్ట్ పిచ్ బాల్‌ను థర్డ్ మ్యాన్ దిశగా ఆడబోయిన జైస్వాల్.. కీపర్ క్యాచ్‌గా వెనుదిరిగాడు. ఫీల్డ్ అంపైర్ నాటౌట్ ఇవ్వగా.. ఆసీస్ రివ్యూ తీసుకుంది.

రిప్లేలో బంతి బ్యాట్‌ను తాకినట్లు స్పష్టమైన ఆధారం లభించలేదు. స్నికో మీటర్‌లోనూ బంతి గ్లోవ్, లేదా బ్యాట్‌ను తాకినట్లు కనిపించలేదు. కానీ బంతి డివియేట్ అయ్యిందని థర్డ్ అంపైర్ ఔటిచ్చాడు. ఈ నిర్ణయంపై తీవ్ర దుమారం రేగింది. స్పష్టమైన ఆధారం లేనప్పుడు ఆన్‌ఫీల్డ్ అంపైర్ నిర్ణయానికి కట్టుబడాలి కదా? అనే చర్చ జరుగుతోంది.

ఈ మ్యాచ్ అనంతరం మీడియాతో మాట్లాడిన ప్యాట్ కమిన్స్‌ను ఈ వికెట్‌పై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. ఇది క్లియర్ ఔటని



బదులిచ్చాడు. 'యశస్వి జైస్వాల్ వికెట్‌తో మాకు పెద్ద ఉపశమనం లభించింది. అతన్ని ఔట్ చేసేందుకు మేము అన్ని విధాల ప్రయత్నించాం. ఓ ఎండ్‌లో పరుగులిచ్చేందుకు కూడా రెడీ అయ్యాం. స్నికోలో బంతి గ్లోవ్, బ్యాట్‌ను తాకినట్లు తేలకపోవడంతో ఆందోళనకు గురయ్యాను. కానీ ఔట్ ఇచ్చేందుకు తగిన ఆధారాలు ఉండటంతో సంతోషపడ్డాను.'అని ప్యాట్ కమిన్స్ చెప్పుకొచ్చాడు. తొలి ఇన్నింగ్స్‌లో విరాట్ కోహ్లీతో కలిసి నిలకడగా ఆడిన జైస్వాల్.. అనవసర పరుగుకు ప్రయత్నించి రనౌటవ్వడం టీమిండియాకు తీవ్ర నష్టం చేసింది. ఫీల్డింగ్‌లోనూ యశస్వి జైస్వాల్ కీలకమైన మూడు క్యాచ్‌లు నేలపాలు చేశాడు.

# అవే బాట్స్ మెన్ కొంపముంచాయి

ఆస్ట్రేలియాతో జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ ఐదు టెస్టుల సిరీస్ లో భారత బ్యాట్స్ మెన్ వరుస వైఫల్యాలతో ఇబ్బందులు పడుతున్నారు. టాప్ ఆర్డర్ లో ఓపెనర్ యశస్వీ జైశ్వాల్ ను మినహాయిస్తే నమ్మకమైన బ్యాట్స్ మెన్ కనిపించడం లేదు.ఆల్ రౌండర్ నితీష్ రెడ్డి సెంచరీతో ఆదుకోకపోతే మెల్ బోర్న్ టెస్టులో ఓటమి ఇంకెంత దారుణంగా ఉండేదో ఊహించలేని పరిస్థితి. ఈ దెబ్బకు కెప్టెన్ రోహిత్ శర్మ రిటైర్ అయ్యేందుకు సిద్దమవుతున్నాడు.అయితే టీమిండియాకు ఇంత దుస్థితి ఎందుకు వచ్చింది, బ్యాట్స్ మెన్ వరుస తప్పిదాల వెనుక కారణం ఏంటి, రోహిత్ శర్మ సిడ్నీలో ఏం చేయాలి.. ఇలా పలు అంశాలపై టీమిండియా మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్ మైఖేల్ పోర్టల్ తో ఎక్స్ క్లూజివ్ గా మాట్లాడారు. ముఖ్యంగా బ్యాట్స్ మెన్ వైఫల్యానికి గల కారణాన్ని అజారుద్దీన్ గుర్తించారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**